RNI NO : TELTEL/2023/89146
Telugu Daily

# శెనార్తి మీడియా

మన యాసే.. మన బలం

తెలుగుదినపత్రిక సంపుటి :3 సంచిక:223 మంగళవారం 22 సెప్టెంబర్ 2026 పేజీలు :8 వెల రూ.5

Published from : Karimnagar Circulated to : Adilabad, Warangal, Hyderabad, Khammam, Nalgonda, Mahbubnagar, Medak, Nizambad, Rangareddy

రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్న వారికి
శెనార్తి మీడియా
ఆహ్వానం పలుకుతుంది
తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో రిపోర్టర్లుగా పని చేసేందుకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లలలో సంప్రదించగలరు.

77309 83966 98491 98098

## హైదరాబాద్‌కు గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్స్ జోరు

- ఏడాది లక్ష్యం కంటే ముందే 100 గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు
- రికార్డు స్థాయిలో అంతర్జాతీయ సంస్థల కార్యకలాపాల విస్తరణ
- నెట్‌ఫ్లిక్స్, వార్నర్ బ్రదర్స్, ఆమ్‌జెన్, యూనిలీవర్ సంస్థల ప్రవేశం
- పారదర్శక పాలన, వేగవంతమైన నిర్ణయాలే పెట్టుబడులకు కారణమన్న సీఎం రేవంత్ రెడ్డి
- 'భారత్ ఫ్యూచర్ సిటీ'తో మరిన్ని పెట్టుబడులకు ప్రణాళిక



**హైదరాబాద్, సెప్టెంబర్ 21:** తెలంగాణ రాజధాని హైదరాబాద్ గ్లోబల్ పెట్టుబడులకు కీలక కేంద్రంగా ఎదుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ ఏడాది నగరంలో 100 కొత్త గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ల (GCC)

మిగతా 2వ పేజీలో..

## జూరాల ఆయకట్టు పంటలను కాపాడాలి



- రైతుల పక్షాన పోరాడుతున్న నేతల అరెస్టు దుర్మార్గం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

3

## వైద్య విద్యార్థిని అకీరాకు కేటీఆర్ ఆర్థిక భరోసా

3



# ఫామ్‌హౌస్ సర్వేపై బీఆర్ఎస్ కౌంటర్

- కాంగ్రెస్ నేతల ఆస్తుల చిట్టా బయటపెట్టిన గులాబీ టీమ్
- కేసీఆర్ కుటుంబ ఫామ్‌హౌస్‌లపై ఆరోపణలకు మన్నె క్రిశాంక్ ప్రతి విమర్శ
- 111 జీవో, అసైన్డ్, అటవీ భూములపై పలు ప్రశ్నలు
- రేవంత్ రెడ్డి సహా పలువురు కాంగ్రెస్ నేతల ఆస్తుల ప్రస్తావన
- ప్రైవేట్ ఆస్తులపై రాజకీయాలు కాకుండా ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని సూచన

**హైదరాబాద్, సెప్టెంబర్ 21:** కేసీఆర్ కుటుంబానికి చెందిన ఫామ్‌హౌస్‌లపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలకు బీఆర్ఎస్ కౌంటర్ ఇచ్చింది. బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్ కాంగ్రెస్ నేతలకు చెందిన ఫామ్‌హౌస్‌లు, ఆస్తుల వివరాలను ప్రస్తావిస్తూ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. కాంగ్రెస్ పాలనలోని వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ప్రైవేట్ ఆస్తుల అంశాన్ని తెరపైకి తెస్తున్నారని ఆరోపించారు.

కాంగ్రెస్ నేతల ఆస్తులపై ప్రస్తావన

వట్టినాగులపల్లిలో 111 జీవో పరిధిలో సీఎం రేవంత్ రెడ్డి ఫామ్‌హౌస్ ఉందని క్రిశాంక్ పేర్కొన్నారు. హిమాయత్‌సాగర్‌లో 111 జీవో పరిధిలోనే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇల్లు, డాక్టర్ వివేక్ వెంకటస్వామి ఫామ్‌హౌస్ ఉన్నాయని తెలిపారు. గుత్తా సుఖేందర్ రెడ్డి ఫామ్‌హౌస్

మిగతా 2వ పేజీలో..

## ఎర్రవల్లిలో కొనసాగిన భూ సర్వే

- పాస్ పుస్తకాలు, నోటీసులతో రైతుల హాజరు
- సర్వే నంబర్ 325లో కొనసాగుతున్న సమగ్ర భూ కొలతలు
- పాండురంగ చెరువు నిర్మాణంతో భూమి కోల్పోయామంటున్న బాధితులు
- న్యాయం చేయాలని వేడుకోలు
- క్షేత్రస్థాయిలో పరిశీలించిన రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ శమీనా బేగం

2



## రూ.813 కోట్ల పరిహారం తక్షణం రైతులకు చేరాలి

- భూసేకరణ, పునరావాస చెల్లింపులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి
- ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేసేందుకే రూ.6 వేల కోట్లకు సీఎం హామీ
- భూములిచ్చే రైతుల పట్ల న్యాయబద్ధంగా, మానవీయంగా వ్యవహరించాలి
- నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి

2





4

## ట్యాంక్‌బండ్‌పై మళ్లీ ఉద్రిక్తత

- హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనానికి బారికేడ్లు తొలగించిన ఉత్సవ సమితి
- పోలీసుల ఆంక్షలను వ్యతిరేకించిన భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి
- సంప్రదాయ నిమజ్జనాన్ని అడ్డుకోవడం సరికాదని నేతల ఆగ్రహం
- కాలుష్య నియంత్రణ కోసం ట్యాంక్‌బండ్‌పై పీవోపీ విగ్రహాల నిమజ్జనానికి ఆంక్షలు
- పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు భారీగా పోలీసుల మోహరింపు

## అదుపుతప్పి మూసీలోకి దూసుకెళ్లిన బస్సు

- స్కూల్ పిల్లలకు తప్పిన ముప్పు



3

## ఉస్మానియా హాస్టల్ల సమస్యలను పరిష్కరించాలి

- హుస్సేన్ సాగర్‌లో యథావిధిగా నిమజ్జనాలకు అనుమతివ్వాలి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు డిమాండ్

2



## 22ఏపై ఎన్‌హెచ్ఆర్సీ కీలక ఆదేశాలు

- ప్రైవేట్ భూములను నిషేధిత జాబితాలో చేర్చడంపై స్వతంత్ర విచారణ
- తెలంగాణ సీఎస్‌కు జాతీయ మానవ హక్కుల సంఘం ఆదేశం
- నాలుగు వారాల్లో చర్యల నివేదిక సమర్పించాలని సూచన
- 22ఏ జాబితాతో ఆస్తుల రిజిస్ట్రేషన్లలో ఇబ్బందులపై ఫిర్యాదు
- రాజ్యాంగ హక్కుల ఉల్లంఘన అంశాన్ని పరిశీలించిన కమిషన్

2



## తిరుమలేశుని సేవలో డిప్యూటీ సీఎం భట్టి

- సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న విక్రమార్క

3



## హెల్త్ ఇన్నోవేషన్స్ కేంద్రంగా తెలంగాణ

- టెక్నాలజీతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు
- హోమా సీఎంఈ 2026 సదస్సు ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్‌బాబు

2

## ట్యూషన్ నుంచి వస్తున్న బాలికపై దారుణం

- జమూయ్‌లో విద్యార్థులను అడ్డగించి బాలికపై లైంగిక వేధింపులు
- బాలికను లాక్కెళ్లేందుకు నిందితుల యత్నం
- ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్
- ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

4



## సోనియా ఓటర్ లిస్ట్ కేసులో కీలక మలుపు

- ఎఫ్ఐఆర్‌పై మెజిస్ట్రేట్ ఆదేశాలను కొట్టివేసిన సెషన్స్ కోర్టు
- పిటిషన్‌పై మళ్లీ విచారణ జరపాలని ఆదేశం
- 1980 ఓటర్ జాబితాలో పేరు నమోదుపై ఫిర్యాదు
- 1983లో పౌరసత్వం పొందినట్లు పిటిషనర్ వాదన

4



## హెల్త్ ఇన్నోవేషన్స్ కేంద్రంగా తెలంగాణ

**హైదరాబాద్, సెప్టెంబర్ 21 :**

దేశంలోనే హెల్త్ ఇన్నోవేషన్స్‌కు ప్రధాన కేంద్రంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఇప్పటికే ఉన్న ఐటీ, ఎమర్జింగ్ టెక్నాలజీస్, ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాలు, స్టార్టప్‌ల సామర్థ్యాలను హెల్త్ కేర్‌తో సమర్థవంతంగా అనుసంధానం చేసే కాంప్రహెన్సివ్ ఇన్నోవేషన్ ఎకో సిస్టంను రాష్ట్రంలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. టీహబ్‌లో 'బయాండ్ నంబర్స్ ప్రెసిషన్ ఫినోటైపింగ్ ఇన్ డయాబెటిస్ అండ్ మెటబాలిక్ కేర' అంశంపై 'హోమా సీఎంఈ 2026' పేరిట నిర్వహించిన జాతీయ సదస్సును ఆయన సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ తమ ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యమిస్తోందన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు మెడిసిన్‌ను టెక్నాలజీతో మిళితం చేస్తున్నామన్నారు. మారుతున్న ఆధునిక జీవనశైలి కారణంగా డయాబెటిస్, ఇతర మెటబాలిక్ వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయన్నారు. వీటిని కేవలం సాంప్రదాయ వైద్య విధానాలతోనే కాక లైఫ్ స్టైల్ డేటాను విశ్లేషించడం ద్వారా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అవకాశముందన్నారు. ఈ తరహా దీర్ఘకాలిక వ్యాధులను ప్రాథమిక దశలో గుర్తించాల్సిన అవసరముందన్నారు. ఆ దిశగా మరిన్ని నూతన ఆవిష్కరణలు రావాలన్నారు. రాబోయే రోజుల్లో హెల్త్ కేర్ రంగంలో ఎదురయ్యే సవాళ్లను పరిష్కరించే కొత్త ఆలోచనలకు తమ ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని మంత్రి శ్రీధర్‌బాబు భరోసానిచ్చారు. ప్రజారోగ్య రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు వైద్య నిపుణులు, పరిశోధకులు, సంస్థలు ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ముందుకు రావాలని కోరారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యుడు ముద్దు సురేంద్ర నెహ్రూ రచించిన 'ది న్యూ పారాడైమ' పుస్తకాన్ని ఆవిష్కరించారు. అలాగే ప్రపంచంలోనే తొలి ఉచిత మెటబాలిక్ కాలిక్యులేటర్ యాప్ 'మెట్రిక్ ఎక్స్ ప్లోరర'ను ప్రారంభించారు. ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్(పీవోసీ) పేరిట ప్రభుత్వ హాస్పిటల్స్ నుంచి ఎంపిక చేసిన 50మంది రోగులకు ఉచిత ప్రొటోకాల్‌ను అందించే కార్యక్రమానికి కూడా ఆయన శ్రీకారం చుట్టారు.

## హైదరాబాద్‌కు గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్స్ జోరు

**మొదటిపేజీ తరువాయి**

ఏర్పాటును లక్ష్యంగా పెట్టుకోగా, నిర్దేశిత గడువు కంటే ముందే ఆ లక్ష్యాన్ని చేరుకున్నట్లు వెల్లడించారు. అంతర్జాతీయ సంస్థలు హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలను విస్తరించేందుకు ఆసక్తి చూపుతున్నాయని పేర్కొన్నారు.

**ప్రముఖ సంస్థల విస్తరణ**

నెట్‌ఫ్లిక్స్, వార్నర్ బ్రదర్స్, అమ్‌జెన్, యూనిలీవర్ వంటి అంతర్జాతీయ సంస్థలు హైదరాబాద్‌ను తమ కీలక కార్యకలాపాల కేంద్రంగా ఎంచుకున్నాయని సీఎం తెలిపారు. రాష్ట్రంలో పారదర్శక పాలన, వేగంగా నిర్ణయాలు తీసుకునే విధానం పెట్టుబడులను ఆకర్షించేందుకు దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. గ్లోబల్ సంస్థల రాకతో హైదరాబాద్ వాణిజ్య, సాంకేతిక రంగాల్లో మరింత ప్రాధాన్యం సంతరించుకుంటోందన్నారు.

**ఫ్యూచర్ సిటీపై దృష్టి**

తెలంగాణను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో 'భారత్ ఫ్యూచర్ సిటీ'ని అభివృద్ధి చేస్తున్నట్లు రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, ఆధునిక సాంకేతిక వనరులతో ఈ నగరాన్ని తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. విదేశీ పెట్టుబడులు, తెలంగాణలోని నైపుణ్య మానవ వనరుల సమ్మేళనంతో రాష్ట్రం దేశ ఆర్థిక ప్రగతిలో కీలక పాత్ర పోషిస్తోందని సీఎం పేర్కొన్నారు.

## 22ఏపై ఎన్‌హెచ్‌ఆర్సీ కీలక ఆదేశాలు

- ప్రైవేట్ భూములను నిషేధిత జాబితాలో చేర్చడంపై స్వతంత్ర విచారణ
- తెలంగాణ సీఎస్‌కు జాతీయ మానవ హక్కుల సంఘం ఆదేశం
- నాలుగు వారాల్లో చర్యల నివేదిక సమర్పించాలని సూచన
- 22A జాబితాతో ఆస్తుల రిజిస్ట్రేషన్లలో ఇబ్బందులపై ఫిర్యాదు
- రాజ్యాంగ హక్కుల ఉల్లంఘన అంశాన్ని పరిశీలించిన NHRC

**హైదరాబాద్, సెప్టెంబర్ 21:**

తెలంగాణలో 22A నిషేధిత జాబితాలో ప్రైవేట్ వ్యక్తుల భూములను చేర్చిన వ్యవహారంపై జాతీయ మానవ హక్కుల సంఘం (NHRC) కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ అంశంపై స్వతంత్ర విచారణ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. విచారణలో తీసుకున్న చర్యలు, పురోగతిపై నాలుగు వారాల్లో నివేదిక సమర్పించాలని సూచించింది.

**ఫిర్యాదుపై విచారణ**

22A నిషేధిత జాబితా కారణంగా సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రస్తావిస్తూ హైదరాబాద్‌కు చెందిన న్యాయవాది, సామాజికవేత్త కారుపోతుల రేవంత్ సెప్టెంబర్ 14న NHRCకి ఫిర్యాదు చేశారు. ప్రైవేట్ భూములు నిషేధిత జాబితాలో చేరడంతో వాటి రిజిస్ట్రేషన్లు, లావాదేవీలు నిలిచిపోతున్నాయని, బాధితులు ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఈ ఫిర్యాదుపై సోమవారం విచారణ చేపట్టిన NHRC.. 22A జాబితా కారణంగా ప్రజల ఆస్తి హక్కులకు భంగం కలుగుతున్న అంశాన్ని పరిశీలించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21, 14, 19(1)(g), 300A కింద ఉన్న హక్కులకు సంబంధించిన అంశాలను పరిగణనలోకి తీసుకుంది.

**ఎలా చేర్చారో తేల్చాలి**

ప్రైవేట్ వ్యక్తుల భూములు 22A నిషేధిత జాబితాలోకి ఎలా చేరాయి? వాటిని చేర్చే ప్రక్రియలో ఏమైనా లోపాలు చోటుచేసుకున్నాయా? అనే అంశాలపై స్వతంత్రంగా విచారణ జరపాలని NHRC ఆదేశించింది. బాధితులకు అవసరమైన ఉపశమనం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించింది. ఇటీవల రాష్ట్రంలో 22A నిషేధిత జాబితాలో ప్రైవేట్ భూములు, కొన్ని నివాస ప్రాంతాలు చేరడంపై ఫిర్యాదులు, వివాదాలు కొనసాగుతున్నాయి. ఈ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. సెక్షన్ 22A కింద నిషేధిత జాబితాలో ఉన్న భూములకు సంబంధించిన పెండింగ్ కేసులను పరిశీలించి పరిష్కరించే బాధ్యతను కమిటీకి అప్పగించింది. తాజాగా NHRC ఆదేశాలతో ఈ వ్యవహారంపై విచారణ, తదుపరి చర్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి




## ఫామ్ హౌస్ సర్వేపై బీఆర్ఎస్ కౌంటర్

**మొదటిపేజీ తరువాయి**

కూడా 111 జీవో పరిధిలోనే ఉందని పేర్కొన్నారు.

కొత్వాల్‌గూడలో అసైన్డ్ భూమిలో పట్నం మహేందర్ రెడ్డి ఫామ్‌హౌస్ నిర్మించారని ఆరోపించారు. కొత్తవాల్‌గూడలో అటవీ భూమిలో ప్రకాష్ గౌడ్ నివాసం ఉందని, వేం నరేందర్ రెడ్డికి అసైన్డ్ భూమి ఉందని తెలిపారు. రెడ్డిపల్లిలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఫామ్‌హౌస్ ఉన్నట్లు తన పోస్టులో ప్రస్తావించారు.

**ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలి**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రైవేట్ ఆస్తుల్లోకి ప్రతినిధి బృందాలతో వెళ్లి రాజకీయాలు చేస్తోందని క్రిశాంక్ విమర్శించారు. బీఆర్ఎస్ కూడా అదే విధానాన్ని అనుసరిస్తే కాంగ్రెస్ నేతలకు సంబంధించిన ఆస్తుల జాబితా చాలా పెద్దదిగా ఉంటుందని వ్యాఖ్యానించారు. ప్రైవేట్ ఆస్తుల అంశాన్ని రాజకీయంగా ఉపయోగించుకోవడం మానుకుని తెలంగాణ ప్రభుత్వం ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించారు.



## రూ.813 కోట్ల పరిహారం తక్షణం రైతులకు చేరాలి

**హైదరాబాద్, సెప్టెంబర్ 21 :**

భూసేకరణ, పునరావాసంపునర్వ్యవస్థీకరణకు ఇప్పటికే విడుదల చేసిన రూ.813 కోట్లను ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత రైతులకు అందించాలని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జిల్లా కలెక్టర్లు, నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. నిధులు విడుదలైనప్పటికీ అవి ప్రభుత్వ ఖాతాల్లోనే ఉండిపోవడం, మరోవైపు భూసేకరణ పూర్తికాక ప్రాజెక్టులు నిలిచిపోవడం ఎంతమాత్రం సమంజసం కాదని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ, పునరావాసంపునర్వ్యవస్థీకరణ పనులు, పరిహారం చెల్లింపుల పురోగతిపై సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఇప్పటివరకు భూసేకరణ, పునరావాసంపునర్వ్యవస్థీకరణకు సంబంధించి రూ.3,101 కోట్ల విలువైన టోకెన్లు సమర్పించగా ప్రభుత్వం రూ.2,504 కోట్లు విడుదల చేసినట్లు అధికారులు వివరించారు. ప్రస్తుతం జిల్లాస్థాయిలో చెల్లింపులకు పెండింగ్‌లో ఉన్న రూ.813 కోట్లలో రూ.502 కోట్లు భూసేకరణ అధికారుల వద్ద, మరో రూ.311 కోట్లు కలెక్టర్ల వద్ద ఉన్నట్లు తెలిపారు. ఈ పరిస్థితిపై మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నిధులు విడుదలైన తరువాత అవి తప్పనిసరిగా భూములు కోల్పోయిన రైతులకు చేరాల్సిందేనని స్పష్టం చేశారు. కలెక్టర్లు చొరవ తీసుకుని రైతులతో సంప్రదింపులు జరపడంతోపాటు అవార్డుల ప్రక్రియను పూర్తి చేసి పరిహారం చెల్లింపులను వేగవంతం చేయాలని ఆదేశించారు. 'ప్రభుత్వం విడుదల చేసిన డబ్బు భూములు కోల్పోయిన రైతులకు చేరాల్సిందే.. ఏదైనా వాస్తవమైన కారణంతో చెల్లించడం సాధ్యం కాకపోతే అందుకు గల కారణాన్ని స్పష్టంగా తెలియజేసి నిధులను తిరిగి ప్రభుత్వానికి పంపాలి.. అంతేగాని నెలలతరబడి ఖాతాల్లో నిరుపయోగంగా ఉంచడానికి వీల్లేదు అని మంత్రి స్పష్టం చేశారు. సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ, పునరావాసం, అటవీ అనుమతులకు సంబంధించిన అవసరాల కోసం 2026లో రూ.6 వేల కోట్లు అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రాధాన్య ప్రాజెక్టుల పనులు నిధుల కొరతతో ఆలస్యం కాకూడదన్న ఉద్దేశంతోనే ఈ మొత్తాన్ని నీటిపారుదల శాఖ సాధారణ బడ్జెట్‌కు అదనంగా సమకూరుస్తున్నట్లు తెలిపారు.

**రైతుల పట్ల మానవీయంగా వ్యవహరించాలి**

భూములు కోల్పోతున్న రైతుల పట్ల అధికారులు న్యాయబద్ధంగా, మానవీయంగా వ్యవహరించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. అవార్డులు జారీ చేసి చెల్లింపులకు అన్ని ఏర్పాట్లు పూర్తయిన తరువాతే టోకెన్లు సమర్పించాలని స్పష్టం చేశారు. రైతుల భూములను తీసుకునే విషయంలో ప్రభుత్వం అన్యాయం చేయబోదు.. చట్టపరమైన నిబంధనలు, నిర్దేశిత ప్రక్రియకు లోబడి సాధ్యమైనంత వరకు మార్కెట్ ధరలకు దగ్గరగా పరిహారం అందించాలని మంత్రి పేర్కొన్నారు. అవార్డు ప్రకటించిన తరువాత కూడా పరిహారం చెల్లింపులు ఆలస్యమైన కేసుల్లో నిబంధనల ప్రకారం రైతులకు వడ్డీ చెల్లించాలని ఆదేశించారు. కోర్టు కేసులు, యాజమాన్య వివాదాల కారణంగా నిలిచిన భూసేకరణ కేసులన్నింటినీ ప్రత్యేకంగా నమోదు చేసి అడ్వొకేట్ జనరల్‌తో చర్చించి వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

**జిల్లాలవారీగా సమస్యలపై సమీక్ష**

నల్గొండ, యాదాద్రి భువనగిరి, నారాయణపేట, సిద్దిపేట, వికారాబాద్, జగిత్యాల, హనుమకొండ తదితర జిల్లాల్లో భూసేకరణకు ఎదురవుతున్న సమస్యలను మంత్రి సమీక్షించారు. నల్గొండ జిల్లాలోని చింతపల్లి రిజర్వాయర్, పెండ్లిపాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, ఉదయసముద్రం, నెల్లికల్లు ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణలో జాప్యంపై ఆరా తీశారు. ముఖ్యంగా ఎసఎల్‌బీసీ సొరంగం పూర్తయిన తరువాత దాని ప్రయోజనాలు రైతులకు అందాలంటే పెండ్లిపాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ భూసేకరణను అత్యవసరంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎసఎల్‌బీసీ సొరంగం పూర్తయినా బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు అవసరమైన భూసేకరణ పూర్తికాకపోతే పెట్టిన పెట్టుబడికి ఆశించిన ప్రయోజనం దక్కదు అని మంత్రి హెచ్చరించారు. భూసేకరణ ప్రక్రియలో రెండుమూడు వారాల సమయాన్ని సాధారణ పరిపాలనా జాప్యంగా భావించవద్దని కలెక్టర్లకు సూచించారు. ప్రతి దశకు నిర్దిష్ట గడువు పెట్టుకుని సాధ్యమైనంత తక్కువ సమయంలో ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. అనేక ప్రాజెక్టుల ప్రధాన పనులు ఇప్పటికే పూర్తయ్యాయని, పంపిణీ కాల్వలు, అనుసంధాన పనులు, కొద్దిపాటి భూసేకరణ పెండింగ్‌లో ఉండటంతోనే వాటి ఫలాలు రైతులకు అందడం లేదని మంత్రి తెలిపారు. అందువల్ల భూసేకరణ ప్రక్రియను అత్యంత ప్రాధాన్య అంశంగా పరిగణించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ చెల్లింపులకు కేసులు పూర్తిగా సిద్ధమైన తరువాతే నిధులను కోరాలని కలెక్టర్లకు సూచించారు. ప్రభుత్వం విడుదల చేసిన నిధులు ఖాతాల్లో నిరుపయోగంగా ఉండకుండా జాగ్రత్త వహించాలని, ఆర్థిక వనరులను బాధ్యతాయుతంగా వినియోగించాలని ఆదేశించారు. కాన్ఫరెన్స్‌లో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్‌రాజ్, ఆర్థిక శాఖ కార్యదర్శి సందీప్ సుల్తానియా, భూసేకరణ కమిషనర్ శివకుమార్‌నాయుడు, జిల్లా కలెక్టర్లు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఉస్మానియా హాస్టళ్ల సమస్యలను పరిష్కరించాలి

**హైదరాబాద్, సెప్టెంబర్ 21 :**

ఉస్మానియా వర్సిటీలో విద్యార్థుల హాస్టల్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, సంప్రదాయబద్ధంగా హుస్సేన్ సాగర్ వేదికగా జరిగే గణేష్ నిమజ్జనాలకు ప్రభుత్వం అనుమతినిచ్చి, సకల సౌకర్యాలు కల్పించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు డిమాండ్ చేశారు. నవరాత్రి ఉత్సవాల వేళ ఉస్మానియా విశ్వవిద్యాలయం తనదైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవాన్ని చాటుకుంటోందని, క్యాంపస్‌లోని ప్రతీ హాస్టల్‌లో విద్యార్థులు వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమని ఆయన అన్నారు. తాను చదివిన 'ఈ' హాస్టల్, ఓల్డ్ పీజీ హాస్టళ్లను సోమవారం సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ముఖ్యంగా పరిశోధక విద్యార్థులుండే ఓల్డ్ పీజీ హాస్టల్ నుండి దాదాపు 15మంది విద్యార్థులు పీహెచ్‌డీ, పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్‌లు, ఐసీహెచఆర్ అర్హతలు సాధించడం గర్వకారణమని, వారందరికీ హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నానని అన్నారు. అయితే విద్యార్థుల వసతి విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు ఆందోళన కలిగిస్తోందన్నారు 'ఈ' హాస్టల్ విద్యార్థులను ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేకుండా బలవంతంగా 'సి' హాస్టల్‌కు మార్చడం వల్ల వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓయూ అభివృద్ధికి రూ.1000 కోట్లు ఇస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటివరకు ఆ నిధుల ఊసే ఎత్తకపోవడం శోచనీయమన్నారు. విద్యాశాఖ బాధ్యతలు కూడా ముఖ్యమంత్రి వద్దే ఉన్నందున తక్షణమే ఆ నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. శిథిలావస్థకు చేరిన పాత హాస్టళ్ల స్థానంలో అత్యాధునిక వసతి గృహాలను నిర్మించాలని, ప్రస్తుత భవనాలకు తక్షణ మరమ్మతులు చేపట్టి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని కోరారు.

**హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనోత్సవాలు నిలిపియవేడం శోచనీయం**

హైదరాబాద్ నగరంలో దశాబ్దాలుగా హుస్సేన్ సాగర్‌ను 'వినాయక సాగర్'గా భావించి భక్తులు నిమజ్జనోత్సవాలు నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. ఈ ఏడాది ప్రధాన సాగర్‌లో నిమజ్జనాలను నిలిపివేసి బ్యాక్‌వాటర్స్ వైపు మళ్లించే ప్రయత్నాలను బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. ఖైరతాబాద్‌లోని 70 అడుగుల మహాగణపతి, కొత్తపేటలోని 73 అడుగుల విగ్రహాలతోపాటు నగరవ్యాప్తంగా లక్షకుపైగా విగ్రహాలు నిమజ్జనానికి తరలివస్తాయని తెలిపారు. భారీ క్రేన్లు, నిరంతర పారిశుధ్య పనుల ద్వారా విగ్రహాలను నిమజ్జనం చేసిన వెంటనే వ్యర్థాలను తొలగించి పర్యావరణానికి ఎలాంటి హాని కలగకుండా నిర్వహించే వెసులుబాటు ఉందని పేర్కొన్నారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి చేస్తున్న న్యాయమైన డిమాండ్లకు బీజేపీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని రామచందర్ రావు తెలిపారు. ప్రజల మనోభావాలను గౌరవిస్తూ ప్రజాప్రతినిధులు, పోలీసు, ప్రభుత్వ యంత్రాంగ సమన్వయంతో ఉత్సవాలు సాఫీగా సాగేందుకు హుస్సేన్ సాగర్‌లోనే గణేష్ నిమజ్జనానికి అనుమతినివ్వాలని, అవసరమైన మౌలిక వసతులు, బందోబస్తు ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



## ఎర్రవల్లిలో కొనసాగిన భూ సర్వే

**మర్కుక్, సెప్టెంబర్ 21 :**

మర్కుక్ మండలం ఎర్రవల్లి గ్రామంలో సర్వే నంబర్ 325లో గల 388.05 గుంటల ప్రభుత్వ భూమిపై చేపట్టిన సమగ్ర భూ సర్వే సోమవారం కూడా కొనసాగింది.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ,రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో శనివారం ఎర్రవల్లి గ్రామంలో సర్వే నంబర్ 325లో సాగు చేస్తున్న వంద మంది రైతులకు తొలి విడత నోటీసులు జారీ చేసి,సోమవారం తమ భూముల హద్దులు చూపించాలని ఆదేశించడంతో రైతులు ఉదయం నుంచే తమ పట్టాదార్ పాస్ బుక్ లు నోటీసులు,ఇతర రెవెన్యూ రికార్డులతో తమ భూముల వద్దకు చేరుకున్నారు.ఏడీ సుదర్శన్ రాథోడ్,డీఐ సేవ్య నాయక్ ఆధ్వర్యంలో నాలుగు బృందాలుగా ఏర్పడిన సర్వే అధికారులు రైతులు చూపిస్తున్న హద్దుల ప్రకారం,రెవెన్యూ రికార్డుల ప్రకారం కొలతలు చేపట్టి వివరాలను నమోదు చేశారు.సోమవారం నాటికి సుమారు 70ఎకరాల వరకు సర్వే పూర్తి అయినట్లు అధికారులు తెలిపారు.ఎర్రవల్లి గ్రామంలో కొనసాగుతున్న సర్వేను రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ శమీనా బేగం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె సర్వే పనులు జరుగుతున్న తీరును,భూముల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.సర్వేలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా కచ్చితమైన కొలతలతో,పారదర్శకంగా నిర్వహించాలని ఆమె అధికారులకు సూచించారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని,అందరికీ న్యాయం జరిగేలా సర్వే చేయాలని ఆమె ఆదేశించారు.అలాగే సోమవారం రోజున మరో 50 మంది రైతులకు నోటీసులు జారీ చేశామని అధికారులు తెలిపారు. గత మూడు రోజులుగా ఈ భూమికి హద్దులు ఏర్పాటు చేస్తున్న అధికారులు ప్రస్తుతం ఎవరి భూమి ఎంత ఉంది, ఎంత ఆక్రమణలో ఉంది.. ఎంత ఖాళీగా ఉంది అనే అంశాలపై క్షేత్ర స్థాయిలో పరిశీలన చేస్తున్నారు.



**మా భూమి అంతా పాండురంగ చెరువులో పోయింది**

కాగా, ఈ సర్వేలో రైతుల ఆవేదన కూడా బయటపడింది. ఇదే సర్వే నంబర్ పరిధిలో గత ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా పాండురంగ చెరువును నిర్మించారని, ఆ చెరువు నిర్మాణంలో రైతులు ఏళ్లుగా సాగు చేసుకుంటున్న దాదాపు 80 ఎకరాల సాగు భూమి పూర్తిగా కోల్పోయామని రైతులు వాపోతున్నారు. తద్వారా పండించుకునే భూమే లేకుండా పోయిందని.. ఇప్పుడు అదే భూములకు తమకు నోటీసులు రావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని అంటున్నారు. 'మా భూమి అంతా పాండురంగ చెరువులో పోయింది.. ఇప్పుడు మాకు నోటీసులు వచ్చాయి.. భూమే లేనప్పుడు మేము అధికారులకు ఏ భూమి చూపించాలం'టూ కొంతమంది రైతులు అధికారులను, సర్వేయర్లను ప్రశ్నిస్తున్నారు. శనివారం నోటీసులు అందుకుని సోమవారం పొలాల వద్దకు వచ్చిన రైతులు తమ భూములు చెరువు నీటిలో కలిసిపోయాయని, చూపించడానికి తమ వద్ద భూమే లేదని కన్నీటితో సమాధానమిచ్చారు. పాండురంగ చెరువు నిర్మాణంతో నష్టపోయిన తమకు న్యాయం చేయాలని, తమ భూములకు సరైన పరిహారం కల్పించాలని లేదా ప్రత్యామ్నాయ భూమిని చూపించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. సర్వే పూర్తయ్యాక నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించి తదుపరి న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు

# జూరాల ఆయకట్టు పంటలను కాపాడాలి

**హైదరాబాద్, సెప్టెంబర్ 21 :**

కళ్లముందే పంటలు ఎండిపోయి అల్లాడుతున్న అన్నదాతల గోసను ప్రభుత్వం తీర్చాల్సిందిపోయి న్యాయమైన డిమాండ్‌తో నిరసనకు సిద్ధమైన బీఆర్ఎస్ శ్రేణులను అణచివేసేందుకు రేవంత్ సర్కారు కుట్ర చేస్తోందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒక ప్రకటనలో మండిపడ్డారు. మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, సి.లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర నాయకులను అక్రమంగా నిర్బంధించడం రేవంత్ రాక్షస మనస్తత్వానికి నిదర్శనమన్నారు. తన చేతకానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికే జిల్లాలోని అనేక మండలాల్లో బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలకు చీకటి ఆదేశాలిచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జూరాలలో తొమ్మిది టీఎంసీల నీటి లభ్యత ఉన్నా విడుదల చేయకుండా కుంటిసాకులతో రేవంత్ సర్కారు పంటల ఉసురు తీస్తోందన్నారు. తమ పంటలను కాపాడుకునే తపనతో గుండెపగిలిన రైతులు జూరాల గేట్లు ఎత్తే ప్రయత్నం చేస్తే వారిపై అక్రమ కేసులు బనాయించిన ప్రభుత్వం అన్నదాతలను అన్ని విధాలా అరిగోస పెడుతోందని ఆయన విమర్శించారు. తెలంగాణ గడ్డపై ఉన్న జూరాల ప్రాజెక్టు పరిసరాల్లోకి రైతులు రాకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి వందలాదిమంది పోలీసులను మోహరించడం ముమ్మాటికీ సిగ్గుమాలిన చర్య అని అన్నారు. తాగు నీటికి కేవలం రెండు టీఎంసీలు సరిపోతాయని తెలిసినా తొమ్మిది టీఎంసీలు ఉన్న జూరాల నుంచి చుక్క నీరు విడుదల చేయకుండా ప్రాజెక్టు కింద ఉన్న ఆయకట్టు రైతులను సంక్షోభంలోకి నెట్టడం క్షమించరాని పాపం అని అన్నారు. అరెస్టు చేసిన తమ నేతలను విడుదల చేయడంతోపాటు జూరాల ఆయకట్టు రైతులకు వెంటనే నీరు విడుదల చేయాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. లేకపోతే అన్నదాతల ఆగ్రహానికి ఈ కాంగ్రెస్ సర్కారు కుప్పకూలడం ఖాయం అని కేటీఆర్ హెచ్చరించారు.

**నీళ్లివ్వాలని అడిగితే అరెస్టు చేస్తారా? : హరీష్‌రావు**

రైతుల పక్షాన పోరాడుతున్న తమ పార్టీకి చెందిన మాజీ మంత్రులు, ఇతర నాయకులను అక్రమంగా నిర్బందించడం దుర్మార్గం అని శాసన సభలో బీఆర్ఎస్ ఉపనాయకుడు టి.హరీష్‌రావు ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కృష్ణా జలాలను శ్రీశైలం నుండి 738 కి.మీ దూరంలో ఉన్న పెన్నా బేసిన్‌లోని కుప్పం వరకు తరలిస్తుంటే పక్కనే ఉన్న పాలమూరుకు మాత్రం ఎందుకు తరలించడం లేదు అని ప్రశ్నించారు. ఇది కాంగ్రెస్ పాలనా వైఫల్యం కాదా.. పాలకుల చేతగానితనం కాదా.. అని నిలదీశారు. పాలమూరు ప్రాజెక్టులో భాగంగా నార్లపూర్, ఏదుల, కరివెన, వట్టెం కలిపి మొత్తం 50 టీఎంసీల సామర్థ్యంతో జలాశయాలను కేసీఆర్ నిర్మిస్తే వాటిని నీళ్లతో నింపే సోయి కూడా మీకు లేదా అని ఆయన ప్రశ్నించారు. గత రెండున్నరేళ్లు కృష్ణానదిలో పుష్కలంగా నీళ్లు పారినా ఎందుకు మోటర్లను నడపలేదు.. శ్రీశైలం నిండు కుండలా ఉన్నా రైతులకు నీళ్లు ఎత్తిపోసే ఆలోచన ఎందుకు చేయలేదు.. కృష్ణా జలాలను ఏపీకి వదిలిపెట్టి తెలంగాణ రైతుల ప్రయోజనాలను ఎందుకు గాలికొదిలేశారు అని నిలదీశారు. ముఖ్యమంత్రి గానీ, నీళ్ల మంత్రిగాని దీనికి సమాధానం చెప్పాలన్నారు. పాలమూరు ప్రాజెక్టును పడావు పెట్టి రైతుల నోట్లో మట్టి కొట్టారన్నారు. పాలమూరు బిడ్డ అని చెప్పుకునే రేవంత్ రెడ్డి పాలమూరు రైతులకు చేస్తున్న నమ్మకద్రోహం ఇది అని హరీష్‌రావు మండిపడ్డారు. రైతులంటే ఎందుకు అంత నిర్లక్ష్యం రేవంత్ రెడ్డీ అని ప్రశ్నించారు. జూరాల ప్రాజెక్టు ఆనకట్ట పరిసరాల్లో పోలీసు బలగాలను భారీగా మోహరించారని, కనిపిస్తే అరెస్టులు చేస్తున్నారని, ఎందుకింత దౌర్జన్యం అని అడిగారు. రైతులు నీళ్లు అడుగుతుంటే వాళ్ల చేతికి సంకెళ్లు వేస్తారా అని ఆయన అడిగారు. తప్పు మీరు చేస్తే శిక్ష రైతులు అనుభవించాలా ఆయన అన్నారు. ఎల్‌నినో సాకు చెప్పి పంటలకు నీళ్లు ఇవ్వాల్సిన బాధ్యత నుంచి తప్పించుకుంటున్నారని, పంట పొలాలకు నీళ్లు ఇవ్వడం చేతగాని ప్రభుత్వం ప్రతిపక్షాలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం సిగ్గుచేటు అని విమర్శించారు. జూరాల ఆయకట్టు రైతులకు వెంటనే సాగునీరు విడుదల చేయాలని, అదుపులోకి తీసుకున్న తమ పార్టీ నాయకులను, రైతులను విడుదల చేయాలని హరీష్‌రావు డిమాండ్ చేశారు.

# ఖేలో ఇండియా గేమ్స్‌కు ఘనంగా ఏర్పాట్లు

- **క్రీడా వేదికలు, వసతి, రవాణా, భద్రతపై మంత్రి వాకిటి సమీక్ష**

**హైదరాబాద్, సెప్టెంబర్ 21 :**

రాష్ట్రంలో ఈ ఏడాది డిసెంబర్ 11 నుండి 23వ తేదీ వరకు నిర్వహించనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2026 పోటీలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, విజయవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో పోటీల ఏర్పాట్లపై సచివాలయంలో క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి సోమవారం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. పోటీల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను శాఖల వారీగా మంత్రి సమీక్షించారు. క్రీడా వేదికల సంసిద్ధత, మౌలిక సదుపాయాల కల్పన, క్రీడాకారుల వసతి, రవాణా, భద్రత, వైద్య సదుపాయాలు, ఆహారం, పరిశుభ్రత, స్వాగత ఏర్పాట్లు, ప్రచార కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే యువ క్రీడాకారులకు అత్యుత్తమ వసతులు కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రతి క్రీడా వేదికలో అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు చేపట్టాలని, పోటీల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఖేలో ఇండియా గేమ్స్ వంటి జాతీయస్థాయి పోటీలు రాష్ట్రంలో యువ క్రీడాకారులకు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు మరిన్ని అవకాశాలను కల్పి



స్తాయని మంత్రి పేర్కొన్నారు. క్రీడా సంస్కృతిని మరింత బలోపేతం చేయడంతోపాటు గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. తెలంగాణ ఆతిథ్యానికి, క్రీడా రంగంలో రాష్ట్ర ప్రతిష్ఠకు తగిన స్థాయిలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహించేందుకు అధికారులు సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాలని స్పష్టం చేశారు. సమీక్షలో ప్రభుత్వ క్రీడల సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఎండీ సోని బాలదేవి, క్రీడా శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో యాక్షన్ ప్లాన్‌పై అక్టోబర్ 2న తీర్మానాలు

- **ప్రతి గ్రామ పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దాలి**
- **పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క**

**హైదరాబాద్, సెప్టెంబర్ 21 :**

ఎల్‌నినో ప్రభావంతో రానున్న కాలంలో ఎదురయ్యే పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు గ్రామస్థాయిలో పటిష్టమైన కార్యాచరణ రూపొందించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. ఖైరతాబాద్‌లోని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖపై సోమవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అక్టోబర్ 2న నిర్వహించనున్న గ్రామ సభలు, ఎల్‌నినో నేపథ్యంలో గ్రామాల వారీగా చేపట్టాల్సిన పనులు, పంచాయతీల్లో అమలు చేయాల్సిన అభివృద్ధి ప్రణాళికపై మంత్రి సమీక్షించారు. సమావేశానికి స్పెషల్ సీఎస్ దానకిషోర్, అడిషనల్ కమిషనర్ పి.రవీందర్‌తోపాటు శాఖకు చెందిన ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని యాక్షన్ ప్లాన్‌పై అసెంబ్లీలో చర్చించి తీర్మానం చేశామని చెప్పారు. అక్టోబర్ 2న ప్రతి గ్రామ పంచాయతీలో నిర్వహించే గ్రామ సభల్లో ఎల్‌నినో యాక్షన్ ప్లాన్‌పై చర్చించి గ్రామ స్థాయిలో అవసరమైన చర్యలపై తీర్మానాలు చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామానికి అవసరమైన పనులు ఏమిటి.. అందుబాటులో ఉన్న నిధులు ఎంత.. వచ్చే ఏడాది కాలంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ద్వారా గ్రామ పంచాయతీలకు అందే నిధులు ఎంత అనే అంశాలపై గ్రామ సభల్లో సమగ్రంగా చర్చించి గ్రామ అవసరాలకు అనుగుణంగా కార్యాచరణను ఆమోదించాలని మంత్రి సూచించారు.



# అక్టోబర్‌లోగా యాతాలకుంట టన్నెల్ పూర్తి

**దమ్మపేట, సెప్టెంబర్ 21 :**

శ్రీ సీతారామ ప్రాజెక్టు ద్వారా సత్తుపల్లి ట్రంక్‌కు గోదావరి జలాలను అందించి రైతులకు సాగునీటి భరోసా కల్పించేందుకు పనులను వేగవంతం చేస్తున్నామని వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సత్తుపల్లి మండలం యాతాలకుంట వద్ద సీతారామ ప్రాజెక్టు టన్నెల్ పనులను అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్‌లతో కలిసి ఆయన సోమవారం పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. టన్నెల్ కింది భాగంలో ఉన్న ఖాళీలను కాంక్రీట్‌తో పటిష్టంగా నింపాలని, గ్రౌటింగ్, ప్యాకింగ్, కాంక్రీట్ పనులను సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని సూచించారు. నాణ్యత, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఎలాంటి జాప్యానికి తావులేకుండా పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. టన్నెల్ పనులను 25 రోజుల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని అధికారులు మంత్రికి వివరించారు. అక్టోబరులో పనులు పూర్తి చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేలా అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. టన్నెల్ లైనింగ్, కెనాల్ లైనింగ్, రోడ్ క్రాసింగ్స్ తదితర మిగిలిన పనులను సమన్వయంతో వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. అనంతరం ములకలపల్లి మండలం కుమ్మరిపాడులో ఎస్‌టీఎస్‌డీఎఫ్ నిధులు రూ.4.63 కోట్ల అంచనాతో నిర్మించిన హై లెవల్ బ్రిడ్జి, బీటీ రోడ్డును మంత్రి తుమ్మల ప్రారంభించారు. గ్రామీణ ప్రజలకు రాకపోకలు సులభతరం చేయడంతోపాటు అన్ని కాలాల్లో రవాణా సౌకర్యం అందుబాటులో ఉండేలా మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. తదుపరి ములకలపల్లి మండలం కమలాపురంలో సీతారామ ఎత్తిపోతల పథకంలోని మూడో పంప్‌హౌస్‌ను ఎమ్మెల్యే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి పరిశీలించి మోటార్‌ను ఆన్ చేసి అన్నదైవం ప్రాజెక్టుకు నీటిని విడుదల చేశారు. సాగు అవసరాలకు అనుగుణంగా నీటిని సమర్థవంతంగా వినియోగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీతారామ ద్వారా సత్తుపల్లి ట్రంక్‌కు గోదావరి జలాలను అందించాలన్నది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిల లక్ష్యమని తెలిపారు. పనుల్లో తొందరపాటు కంటే నాణ్యత, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పటిష్టంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. టన్నెల్ లైనింగ్, కెనాల్ లైనింగ్, రోడ్ క్రాసింగ్స్ తదితర పనులను వేగవంతం చేసి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించామని తెలిపారు. భూసేకరణ సమస్యలను దాదాపుగా పరిష్కరించామని ఆయన తెలిపారు. భూసేకరణ కోసం ఇటీవల రూ.48 కోట్లు విడుదల చేశామని, ఇంకా అవసరమైన భూముల కోసం కలెక్టర్ ప్రతిపాదనలు పంపితే నిధులను సమకూర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. వర్షాలు లేకపోవడం వల్ల భూగర్భ జలాలు కూడా తగ్గుతున్నాయని, ఈ పరిస్థితుల్లో ఖరీఫ్ పంటలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. సాగు చేసిన పంటలకు అవసరమైన సమయంలో నీటిని అందించేందుకు గోదావరి జలాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. నీటి లభ్యతను ముందుగానే అంచనా వేసుకుని ఏ ప్రాంతానికి ఎంత నీరు అవసరమో ప్రణాళిక రూపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నీటి నిల్వలు తగ్గితే జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గే అవకాశం ఉంటుందని, అదే సమయంలో వ్యవసాయం, పరిశ్రమలు, గృహా వసరాల కోసం విద్యుత్ డిమాండ్ పెరుగుతుందని చెప్పారు. జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గినప్పుడు థర్మల్ విద్యుత్‌పై ఎక్కువగా ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. సీతారామ ద్వారా ములకలపల్లి, దమ్మపేట, అశ్వారావుపేట ప్రాంతాల్లో కూడా సాగునీటి అవసరాలను తీర్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని మంత్రి తెలిపారు. ముఖ్యంగా దమ్మపేట, అశ్వారావుపేట ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఆయిల్‌పామ్ సాగు జరుగుతున్నందున సాగునీటి సౌకర్యం మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందన్నారు. నాలుగో పంప్‌హౌస్ ద్వారా అవసరమైన ప్రాంతాలకు నీటిని తీసుకెళ్లేలా పనులను వేగవంతం చేయాలని మంత్రి తెలిపారు. ప్రధాన కాల్వలతోపాటు అవసరమైనచోట్ల పైప్‌లైన్ వ్యవస్థను ఏర్పాటు చేస్తే భూసేకరణ సమస్యలు తగ్గుతాయని, నీటిని నేరుగా రైతుల పొలాలకు తీసుకెళ్లే అవకాశం ఉంటుందని చెప్పారు. పైప్‌లైన్‌తోపాటు డ్రిప్, స్ప్రింక్లర్ విధానాలను ప్రోత్సహించడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించవచ్చని, తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. సీతారామ పనులపై కలెక్టర్, స్థానిక ప్రజాప్రతినిధులు వారానికోసారి సమీక్ష నిర్వహించాలని, ఎక్కడా పనులు నిలిచిపోకూడదని, ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే జిల్లా స్థాయిలో పరిష్కరించాలని మంత్రి సూచించారు. అవసరమైన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

**ములకలపల్లి ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం**

ములకలపల్లి ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. రహదారులు, మండల కార్యాలయాలు, గురుకులాలు, ఏకలవ్య పాఠశాలలు, విద్యుత్ సబ్‌స్టేషన్లు, ఎంపీడీవో కార్యాలయం, పోలీస్ స్టేషన్ తదితర మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. అన్నదైవం ప్రాజెక్టుకు నీటిని విడుదల ద్వారా ఈ ప్రాంత రైతులకు సాగునీటి ప్రయోజనం కల్పించే దిశగా మరో అడుగు ముందుకు వేసినట్లు మంత్రి తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు మెరుగైన రవాణా సౌకర్యాలు, పారిశ్రామిక, వ్యవసాయ అభివృద్ధికి విమానాశ్రయం, రైల్వే అనుసంధానం వంటి మౌలిక వసతులు అవసరమని అన్నారు. విమానాశ్రయానికి సంబంధించి సాధ్యాసాధ్యాల నివేదిక సిద్ధమైన అనంతరం తదుపరి చర్యలు చేపడతామని చెప్పారు. రైల్వే అనుసంధానానికి సంబంధించి పాండురంగాపురం మణుగూరు మార్గం, భద్రాచలం వైపు రైల్వే విస్తరణ అంశాలపై కూడా కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమాల్లో ఇంజినీరింగ్, రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# వైద్య విద్యార్థిని అకీరాకు కేటీఆర్ ఆర్థిక భరోసా

- **ఎంబీబీఎస్ చదువుకు రూ.2 లక్షల ఆర్థిక సహాయం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 21:**

ఆర్థిక ఇబ్బందులతో వైద్య విద్యను కొనసాగించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న వరంగల్ జిల్లా వర్ధన్నపేటకు చెందిన కొండేటి అకీరాకు కేటీఆర్ అండగా నిలిచారు. ఎంబీబీఎస్ విద్యను కొనసాగించేందుకు రూ.2 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించారు. వర్ధన్నపేట పట్టణానికి చెందిన కొండేటి భాస్కర్, అనిత దంపతుల కుమార్తె అకీరా. తుర్రూరులోని సాంఘిక సంక్షేమ పాఠశాలలో పదో తరగతి, ఖమ్మంలోని అంబేడ్కర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యను పూర్తి చేసిన అకీరా జాతీయ వైద్య ప్రవేశ పరీక్షలో అఖిల భారత స్థాయిలో 2,99,946 ర్యాంకు, ఎస్సీ విభాగంలో 27,865 ర్యాంకు సాధించింది. అనంతరం పటాన్‌చెరువులోని మహేశ్వర వైద్య కళాశాలలో ఎంబీబీఎస్‌లో ప్రవేశం పొందింది. అకీరా వైద్య విద్యకు సంబంధించిన ఆర్థిక ఇబ్బందుల విషయాన్ని జర్నలిస్ట్ బొల్లెపాక రాజేష్ ట్విట్టర్ ద్వారా కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న కేటీఆర్ స్పందించి అకీరా చదువుకు ఆర్థిక సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం సోమవారం తెలంగాణ భవన్‌లో అకీరాకు రూ.2 లక్షల ఆర్థిక సహాయాన్ని కేటీఆర్ అందజేశారు. పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా అండగా ఉంటానని పేర్కొంటూ, అకీరా భవిష్యత్తులో వైద్యురాలిగా ఎదగాలని ఆకాంక్షించారు. అంతేకాకుండా అకీరా వైద్య విద్య పూర్తయ్యే వరకు భవిష్యత్తులోనూ అండగా ఉంటానని కేటీఆర్ హామీ ఇచ్చారు. కేటీఆర్ అందించిన ఆర్థిక సహాయంతో తన వైద్య విద్యను కొనసాగించేందుకు మరింత ధైర్యం వచ్చిందని అకీరా తెలిపింది. తన చదువుకు అండగా నిలిచిన కేటీఆర్‌కు అకీరా కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# తిరుమలేశుని సేవలో డిప్యూటీ సీఎం భట్టి

- **సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న విక్రమార్క**

**తిరుమల, సెప్టెంబర్ 21 :**

తిరుమల తిరుపతి సాలకట్ల బ్రహ్మోత్సవాలలో భాగంగా ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క ఆదివారం రాత్రి ఉత్సవాల్లో పాల్గొని సోమవారం తెల్లవారుజామునల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న డిప్యూటీ సీఎంకు తిరుమల తిరుపతి దేవస్థానం( టీటీడీ) అధికారులు స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం ఆలయ మండపంలో వేద పండితులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వేదాశీర్వచనం చేశారు. అనంతరం అధికారులు స్వామివారి శేష వస్త్రంతో ఆయనను సత్కరించి శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు.




# అదుపుతప్పి మూసీలోకి దూసుకెళ్లిన బస్సు

- **స్కూల్ పిల్లలకు తప్పిన ముప్పు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 21 :**

రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో స్కూల్ బస్సు అదుపుతప్పి మూసీ నదిలోకి దూసుకెళ్లిన సంఘటన సోమవారం జరిగింది. దీంతో బస్సులోని చిన్నారులు, స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. త్రుటిలో పెను ప్రమాదం తప్పడంతో చిన్నారుల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు, సంబంధిత అధికారులు ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. స్కూల్ బస్సు రోడ్డుపై నుంచి అదుపుతప్పి మూసీ నదిలోకి దూసుకెళ్లడంతో ఆ మార్గంలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. బస్సును అక్కడి నుంచి తొలగించేందుకు చర్యలు చేపట్టడంతోపాటు ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. డ్రైవర్ నిర్లక్ష్యమా లేక మరేదైనా కారణమా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు.

# నేడు జూరాలను సందర్శించనున్న బీజేపీ బృందం

**హైదరాబాద్, సెప్టెంబర్ 21 :**

జూరాల ప్రాజెక్టులోని నీటిమట్టాన్ని పరిశీలించి రైతుల సమస్యలను తెలుసుకునేందుకు తన నేతృత్వంలోని బీజేపీ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం మంగళవారం జూరాల ప్రాజెక్టును సందర్శించనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు తెలిపారు. ప్రజల సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే బీఆరఎస్, కాంగ్రెస్‌లు డ్రామాలు ఆడుతున్నాయని విమర్శించారు. వరంగల్‌కు చెందిన ఐటీడీఏ ప్రాజెక్టు విశ్రాంత అధికారితోపాటు పలువురు ప్రముఖులకు పార్టీ కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. అనంతరం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పంటలను కాపాడేందుకు జూరాల ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసేలా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక నాయకుల మధ్య వివాదాలు, సరైన సమన్వయం లేకపోవడం వల్ల దిగువ ప్రాంత రైతులు నష్టపోతున్నారన్నారు. కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వంతో మాట్లాడి ఆలమట్టి, నారాయణపూర్ డ్యామ్‌ల నుంచి నీటి విడుదలను తెలంగాణ ప్రభుత్వం నిర్ధారించుకోవాలని కోరారు. ఫామ్‌హౌస్ వివాదాల్లో కేసులు ఎందుకు నమోదు చేయడం లేదని ప్రశ్నించారు. వినాయక నిమజ్జన ఊరేగింపు ఏర్పాట్లకు పోలీసు బలగాలను ఉపయోగించకుండా ఎర్రవల్లి ఫామ్‌హౌస్ చుట్టూ మోహరించి ప్రభుత్వం పోలీసు శాఖను దుర్వినియోగం చేస్తోందని మండిపడ్డారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యుల అరెస్టును తీవ్రంగా ఖండించారు. సంప్రదాయం ప్రకారం హుస్సేన్‌సాగర్‌లో గణేష్ విగ్రహాల నిమజ్జనానికి అనుమతితోపాటు అన్ని ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. 70 అడుగుల ఎత్తైన విగ్రహాలు సహా భారీ విగ్రహాలను బ్యాక్‌వాటర్‌కు మళ్లించకుండా ట్యాంక్‌బండ్‌లోనే నిమజ్జనం చేయడానికి అనుమతించాల్సిందేనని స్పష్టం చేశారు.



# రామ మందిర విరాళాల చోరీ కేసులో నిందితుల గుర్తింపు

- 25న చార్జిషీటు దాఖలు

**లక్నో, సెప్టెంబర్ 21:**

సంచలనం సృష్టించిన అయోధ్య రామ మందిరం విరాళాల చోరీ కేసుకు సంబంధించి విచారణ తుది దశకు చేరుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితులను గుర్తించినట్లు ప్రత్యేక విచారణ బృందం (సిట్) వెల్లడించింది. ఈనెల 25న ఈ కేసుకు సంబంధించి చార్జిషీటు దాఖలు చేయనున్నట్లు సిట్ స్పష్టం చేసింది. అయోధ్య రామ మందిరం విరాళాల చోరీ ఉదంతంపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక విచారణ బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు స్వయంగా ఈ సిట్ విచారణను పర్యవేక్షిస్తోంది. ఇందులో భాగంగా సోమవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం ముందు ఈ కేసుకు సంబంధించిన స్టేటస్ రిపోర్టును సిట్ సమర్పించింది. సిట్ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టులో వాదనలు వినిపించారు.

**సేకరించిన ఆధారాలు ఇవే**

ఈ కేసు విచారణలో భాగంగా సీసీటీవీ ఫుటేజ్ను పరిశీలించడంతో పాటు అన్ని ఆధారాలను సిట్ సేకరించింది. ఈ వ్యవహారంలో గల్లంతైన డబ్బును, ఇతర విలువైన వస్తువులను సిట్ గుర్తించి స్వాధీనం చేసుకుంది. సేకరించిన ఆస్తులను ఎస్బీఐ లాకర్లలో భద్రపరిచారు. విచారణలో సాక్ష్యాలుగా ఉపయోగపడే తగిన డాక్యుమెంట్లు, ఎలక్ట్రానిక్ ఎవిడెన్స్ సిట్ సాధించింది. డొనేషన్ల డొనేషన వివరాలు, రసీదులు, సంబంధిత పత్రాలతో లతో పాటు సాఫ్ట్ వేర్ వివరాలు కూడా సిట్ వద్ద ఉన్నాయి.

# 10 ఏళ్ల బాలికపై లైంగిక దాడి

- ఢిల్లీలోని సదర్‌బజార్‌లో దారుణ ఘటన
- స్టేషనరీ కోసం వెళ్లిన బాలికపై అఘాయిత్యం
- కాళ్లు, చేతులు కట్టేసి దాడికి పాల్పడిన నిందితుడు
- అత్యాచారం, పోక్సో, కిడ్నాప్ సెక్షన్ల కింద కేసు
- 56 ఏళ్ల నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21:**

దేశ రాజధాని ఢిల్లీలోని సదర్‌బజార్ ప్రాంతంలో 10 ఏళ్ల బాలికపై లైంగిక దాడి జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఆరో తరగతి చదువుతున్న బాలిక స్టేషనరీ వస్తువులు కొనుగోలు చేసేందుకు బయటకు వెళ్లిన సమయంలో ఓ దుకాణంలోకి తీసుకెళ్లి నిందితుడు ఆమె కాళ్లు, చేతులు కట్టేసి అఘాయిత్యానికి పాల్పడినట్లు వెల్లడించారు.

**ఫిర్యాదుతో కేసు నమోదు**

బాధిత బాలిక ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు. అత్యాచారం, పోక్సో చట్టంతో పాటు కిడ్నాప్‌కు సంబంధించిన పలు తీవ్రమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

**నిందితుడి అరెస్ట్**

ఘటనకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 56 ఏళ్ల వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. బాలిక మైనర్ కావడంతో చట్టపరమైన నిబంధనల ప్రకారం ఆమెకు సంబంధించిన వివరాలను పోలీసులు వెల్లడించలేదు. కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు తెలిపారు.



# మాస్కోపై డ్రోన్ల దండయాత్ర

- రష్యా పార్లమెంటరీ ఎన్నికల చివరి రోజున భారీ దాడి
- మాస్కో వైపు వచ్చిన 450 డ్రోన్లను కూల్చివేసినట్లు సోబ్యానిన్ వెల్లడి
- చమురు శుద్ధి కర్మాగారం, నివాస భవనాలపై శకలాల ప్రభావం
- ప్రతిదాడిగా కైవ్ సహా ఉక్రెయిన్ నగరాలపై రష్యా దాడులు

**మాస్కో, సెప్టెంబర్ 21:**

రష్యా పార్లమెంటరీ ఎన్నికల పోలింగ్ చివరి రోజున మాస్కో, పరిసర ప్రాంతాలపై ఉక్రెయిన్ భారీ డ్రోన్ దాడికి పాల్పడింది. శనివారం రాత్రి నుంచి ఆదివారం వరకు రష్యా భూభాగం వైపు 1,600కు పైగా డ్రోన్లు వచ్చినట్లు, వాటిలో 450 మాస్కోను లక్ష్యంగా చేసుకున్నాయని మాస్కో మేయర్ సెర్గీ సోబ్యానిన్ తెలిపారు. గగనతల రక్షణ వ్యవస్థలు భారీ సంఖ్యలో డ్రోన్లను కూల్చివేసినప్పటికీ.. కొన్ని డ్రోన్లు లక్ష్య ప్రాంతాలకు చేరుకున్నాయి.

**చమురు కర్మాగారంలో మంటలు**

మాస్కో ఆయిల్ రిఫైనరీలోని ఓ ప్రాంతం డ్రోన్ దాడిలో దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు. కొన్ని డ్రోన్లు రిఫైనరీ ప్రాంగణంలో పడటంతో మంటలు చెలరేగాయి. ఓ డ్రోన్ నివాస భవనాన్ని తాకడంతో భారీగా నష్టం వాటిల్లింది. మాస్కో పరిధిలోని ఓ 21 అంతస్తుల భవనం నుంచి సుమారు 400 మందిని అధికారులు ఖాళీ చేయించారు. దాడుల్లో ఓ వృద్ధుడు, 44 ఏళ్ల మహిళ మృతి చెందగా.. 20 మంది గాయపడ్డారని స్థానిక అధికారులు వెల్లడించారు. అనంతరం గాయపడిన మరో వ్యక్తి మృతి చెందడంతో మృతుల సంఖ్య మూడుకు చేరినట్లు రష్యా అధికారులు తెలిపారు.

**ఎన్నికలనే లక్ష్యంగా చేసుకున్నారా?**

ఎన్నికల ప్రక్రియను దెబ్బతీసేందుకు ఈ దాడి జరిగినట్లు మాస్కో మేయర్ సోబ్యానిన్ ఆరోపించారు. అయితే దాడి ప్రభావం పోలింగ్‌పై పడలేదని రష్యా అధికారులు పేర్కొన్నారు. ఉక్రెయిన్ మాత్రం ఈ దాడిపై అధికారికంగా స్పందించలేదు. అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్స్కీ మాత్రం రష్యా సైనిక చర్యకు నిధులు సమకూర్చే చమురు, లాజిస్టిక్స్ కేంద్రాలను లక్ష్యంగా చేసుకున్నట్లు తెలిపారు. స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసిన డ్రోన్లు, క్షిపణులను వినియోగించినట్లు ఆయన వెల్లడించారు.

**కైవ్‌పై రష్యా ఎదురుదాడి**

మాస్కోపై దాడికి ప్రతిస్పందనగా రష్యా కూడా ఉక్రెయిన్‌పై వైమానిక దాడులు కొనసాగించింది.

# ట్యూషన్ నుంచి వస్తున్న బాలికపై దారుణం

- జమూయ్‌లో విద్యార్థులను అడ్డగించి బాలికపై లైంగిక వేధింపులు
- బాలికను లాక్కెళ్లేందుకు నిందితుల యత్నం
- ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్
- ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు
- ఘటనపై రాహుల్‌గాంధీ ఆగ్రహం.. పోక్సో కింద కఠిన చర్యలకు డిమాండ్

**జమూయ్, సెప్టెంబర్ 21:**

బిహార్‌లోని జమూయ్‌లో ట్యూషన్ ముగించుకుని ఇంటికి వెళ్తున్న పదో తరగతి బాలికపై కొందరు యువకులు లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. బాలికతో పాటు స్కూటర్‌పై ఉన్న బాలుడిని అడ్డుకున్న నిందితులు.. ఆమెను వేధిస్తూ లాక్కెళ్లేందుకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తీవ్ర దుమారం రేగింది.



**బహిరంగ రహదారిపై వేధింపులు**

జమూయ్ పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న బాలిక, బాలుడు శనివారం సాయంత్రం ట్యూషన్ ముగించుకుని స్కూటర్‌పై ఇంటికి బయల్దేరారు. జమూయ్‌లఖిసరాయ్ రహదారిపై కొందరు యువకులు వారిని అడ్డుకున్నారు. బాలికను వేధిస్తూ చేతులు వేయడంతో ఆమె భయంతో వదిలేయాలని వేడుకున్నట్లు వీడియోలో కనిపిస్తోంది. బాలుడి చొక్కా కాలర్ పట్టుకుని లాగడంతో పాటు బాలికను మరోవైపు తీసుకెళ్లేందుకు కొందరు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. బాలిక తప్పించుకునేందుకు ప్రయత్నించగా ముఖానికి ముసుగు ధరించిన వ్యక్తి ఆమెను వెంబడించినట్లు వీడియోలో ఉంది. కొద్దిసేపటి తర్వాత బాలుడు వారి చెర నుంచి తప్పించుకుని బాలిక వద్దకు చేరుకున్నాడు. ఇద్దరూ స్కూటర్ వద్దకు వెళ్లి అక్కడి నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించినా నిందితులు వారిని వెంబడించినట్లు వీడియోలో కనిపించింది. శనివారం రాత్రి సుమారు 7 గంటల సమయంలో ఈ ఘటన జరిగినట్లు పోలీసులు తెలిపారు.

**ముగ్గురు అరెస్ట్**

వీడియో వైరల్ కావడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాధిత విద్యార్థుల నుంచి వివరాలు సేకరించిన అనంతరం ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు జమూయ్ ఎస్పీ విశ్వజిత్ దయాళ్ తెలిపారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు.

**రాహుల్‌గాంధీ ఆగ్రహం**

ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ స్పందించారు. బాలికను వేధించి లాక్కెళ్లేందుకు ప్రయత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోక్సో చట్టం కింద నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సాయంత్రం వేళ బహిరంగ రహదారిపై బాలికకు భద్రత లేకపోవడంపై బిహార్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.

**'జంగిల్ రాజ్'గా చూడొద్దు**

ఈ ఘటనను బిహార్ మంత్రి సునీల్ కుమార్ తీవ్రంగా ఖండించారు. జమూయ్ ఎస్పీతో మాట్లాడి నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా చూస్తామని తెలిపారు. తప్పు చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. అయితే ఒక్క ఘటన ఆధారంగా మొత్తం బిహార్‌ను 'జంగిల్ రాజ్'గా చిత్రీకరించడం సరికాదని పేర్కొన్నారు

# భారత్-న్యూజిలాండ్ ఎఫ్‌టీఏకు ముహూర్తం ఖరారు

- అక్టోబర్ 20 నుంచి స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమల్లోకి
- విజయదశమి రోజు నుంచి 100 శాతం భారత ఉత్పత్తులకు సుంక రహిత ప్రవేశం
- వాణిజ్య బంధాల బలోపేతానికి ఒప్పందం కీలక మైలురాయన్న పీయూష్ గోయల్
- నాలుగైదేళ్లలో ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు చేయాలని లక్ష్యం
- కేవలం తొమ్మిది నెలల్లోనే ఎఫ్‌టీఏ చర్చలు పూర్తి

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21:**

భారత్‌న్యూజిలాండ్ మధ్య వాణిజ్య సంబంధాల్లో కీలక ముందడుగు పడనుంది. ఇరు దేశాల మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (FTA) అక్టోబర్ 20 నుంచి అమల్లోకి రానుంది. విజయదశమి సందర్భంగా ఒప్పందం అమల్లోకి వస్తుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. న్యూఢిల్లీలో న్యూజిలాండ్ వాణిజ్య, పెట్టుబడుల శాఖ మంత్రి టాడ్ మెక్లేతో సోమవారం నిర్వహించిన వర్చువల్ సమావేశంలో ఆయన ఈ విషయాన్ని తెలిపారు.



**100 శాతం ఉత్పత్తులకు సుంకం రహితం**

ఎఫ్‌టీఏ అమల్లోకి వచ్చిన రోజు నుంచే భారత్ నుంచి న్యూజిలాండ్‌కు ఎగుమతి చేసే 100 శాతం ఉత్పత్తులకు సుంక రహిత ప్రవేశం లభించనుంది. ఈ ఒప్పందం రెండు దేశాల ఆర్థిక భాగస్వామ్యంలో కీలక మైలురాయిగా నిలుస్తుందని పీయూష్ గోయల్ పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య ఆర్థిక సంబంధాలు ఇటీవలి కాలంలో మరింత బలోపేతమయ్యాయని తెలిపారు.

**వాణిజ్యం రెట్టింపే లక్ష్యం**

భారత్‌న్యూజిలాండ్ ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030 రోడ్‌మ్యాప్‌లో భాగంగా వచ్చే నాలుగైదేళ్లలో దాదాపు రూ.35 వేల కోట్లకు రెట్టింపు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు గోయల్ చెప్పారు. న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ భారత్ పర్యటన, ప్రధాని నరేంద్ర మోదీ 2026 జూలైలో న్యూజిలాండ్ పర్యటనతో ద్వైపాక్షిక సంబంధాలకు మరింత ఊతం లభించిందన్నారు. నాలుగు దశాబ్దాల తర్వాత న్యూజిలాండ్‌లో భారత ప్రధానమంత్రి చేసిన తొలి పర్యటనగా మోదీ పర్యటన నిలిచిందని తెలిపారు.

**ఏప్రిల్‌లో ఒప్పందంపై సంతకాలు**

భారత్‌న్యూజిలాండ్ ఎఫ్‌టీఏపై 2026 ఏప్రిల్ 27న న్యూఢిల్లీలో ఇరు దేశాలు సంతకాలు చేశాయి. కేవలం తొమ్మిది నెలల్లోనే చర్చలను పూర్తి చేసినట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. ఒప్పందం అమల్లోకి రావడంతో ఇరు దేశాల మధ్య వస్తు, సేవల వాణిజ్యానికి మరింత ఊతం లభించే అవకాశం ఉంది.

# ట్యాంక్‌బండ్‌పై మళ్లీ ఉద్రిక్తత

- హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనానికి బారికేడ్లు తొలగించిన ఉత్సవ సమితి
- పోలీసుల ఆంక్షలను వ్యతిరేకించిన భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి
- సంప్రదాయ నిమజ్జనాన్ని అడ్డుకోవడం సరికాదని నేతల ఆగ్రహం
- కాలుష్య నియంత్రణ కోసం ట్యాంక్‌బండ్‌పై పీవోపీ విగ్రహాల నిమజ్జనానికి ఆంక్షలు
- పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు భారీగా పోలీసుల మోహరింపు

**హైదరాబాద్, సెప్టెంబర్ 21:**

వినాయక నిమజ్జనోత్సవాల వేళ ట్యాంక్‌బండ్‌పై మరోసారి ఉద్రిక్తత నెలకొంది. హుస్సేన్‌సాగర్‌లో విగ్రహాల నిమజ్జనాన్ని అడ్డుకునేందుకు పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు ఏర్పాటు చేసిన ఇనుప బారికేడ్లను భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు తొలగించారు. అనంతరం శోభాయాత్రగా వచ్చిన పలువురు హుస్సేన్‌సాగర్‌లో విగ్రహాలను నిమజ్జనం చేయడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది.



**ఆంక్షలపై ఉత్సవ సమితి అభ్యంతరం**

శతాబ్దాలుగా కొనసాగుతున్న నిమజ్జన సంప్రదాయాన్ని నిలిపివేయడం ద్వారా భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిమజ్జనానికి అడ్డుగా ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్స్, బారికేడ్లను తొలగించారు. నిమజ్జనోత్సవాల చివరి ఘట్టం సజావుగా సాగేందుకు ట్యాంక్‌బండ్‌పై ఆంక్షలను ఎత్తివేసి వాహనాలను అనుమతించాలని డిమాండ్ చేశారు.

**కాలుష్య నియంత్రణకు కోర్టు ఆదేశాలు**

హుస్సేన్‌సాగర్‌లో కాలుష్యాన్ని తగ్గించేందుకు తెలంగాణ హైకోర్టు గతంలో పలు ఆదేశాలు జారీ చేసింది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనం చేయకుండా చర్యలు తీసుకోవాలని, పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి విగ్రహాలకు మాత్రమే అనుమతి ఇవ్వాలని స్పష్టం చేసింది. ఇతర విగ్రహాలను బేబీ పాండ్స్, ఎన్టీఆర్ మార్గ్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన నిమజ్జన కేంద్రాల వైపు తరలించాలని సూచించింది. ఈ నేపథ్యంలోనే ట్యాంక్‌బండ్ ప్రధాన రహదారి నుంచి హుస్సేన్‌సాగర్‌లోకి విగ్రహాలను తీసుకెళ్లకుండా అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేశారు.

**భారీగా పోలీసుల మోహరింపు**

ఉత్సవ సమితి నేతలు బారికేడ్లను తొలగించడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ట్యాంక్‌బండ్ పరిసరాల్లో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో పాటు అదనపు పోలీసు బలగాలను మోహరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టారు. కోర్టు ఆదేశాలు, ప్రభుత్వ సూచనలను పాటించాలని, నిబంధనలు ఉల్లంఘించవద్దని పోలీసులు ఉత్సవ సమితి నేతలకు సూచించారు.

# సోనియా ఓటర్ లిస్ట్ కేసులో కీలక మలుపు

- ఎఫ్ఐఆర్‌పై మెజిస్ట్రేట్ ఆదేశాలను కొట్టివేసిన సెషన్స్ కోర్టు
- పిటిషన్‌పై మళ్లీ విచారణ జరపాలని ఆదేశం
- 1980 ఓటర్ జాబితాలో పేరు నమోదుపై ఫిర్యాదు
- 1983లో పౌరసత్వం పొందినట్లు పిటిషనర్ వాదన
- పోలీసుల వాదనలు, స్టేటస్ రిపోర్టు తీసుకోలేదన్న కోర్టు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21:**

కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీకి సంబంధించిన ఓటర్ జాబితా వ్యవహారంలో ఢిల్లీ సెషన్స్ కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. భారత పౌరసత్వం పొందకముందే ఆమె పేరు ఓటర్ జాబితాలో నమోదైందంటూ దాఖలైన ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి నిరాకరిస్తూ మెజిస్ట్రేట్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సోమవారం కొట్టివేసింది. అయితే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని నేరుగా ఆదేశించకుండా.. ఫిర్యాదును చట్ట ప్రకారం మరోసారి పరిశీలించి కారణాలతో కూడిన ఉత్తర్వులు ఇవ్వాలని మెజిస్ట్రేట్ కోర్టును ఆదేశించింది.



**మళ్లీ విచారణకు ఆదేశం**

రౌస్ అవెన్యూ కోర్టుల సెంట్రల్ ఢిల్లీ కోర్ట్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, న్యాయవాది వికాస్ త్రిపాఠి ఈ ఫిర్యాదును దాఖలు చేశారు. సోనియా గాంధీ పేరు 1980లో న్యూఢిల్లీ నియోజకవర్గ ఓటర్ జాబితాలో నమోదైందని, ఆమె 1983లో భారత పౌరసత్వం పొందినట్లు పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేయాలని ఆయన కోరారు. ఈ ఫిర్యాదును 2025 సెప్టెంబర్‌లో మెజిస్ట్రేట్ కోర్టు తిరస్కరించింది. దాన్ని సవాల్ చేస్తూ త్రిపాఠి సెషన్స్ కోర్టును ఆశ్రయించారు. తాజాగా ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గోగ్నే మెజిస్ట్రేట్ ఉత్తర్వులను పక్కనపెట్టి, పిటిషన్‌పై కొత్తగా విచారణ జరపాలని ఆదేశించారు. ఈ వ్యవహారం తదుపరి విచారణకు సెప్టెంబర్ 29న రానుంది.

**BNSS నిబంధనలపై కోర్టు అభ్యంతరం**

భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (BNSS) లోని సెక్షన్ 175(3) ప్రకారం అనుసరించాల్సిన ప్రక్రియను మెజిస్ట్రేట్ కోర్టు సరిగా పాటించలేదని సెషన్స్ కోర్టు పేర్కొంది. ముఖ్యంగా సంబంధిత పోలీసు అధికారి వాదనలు వినకపోవడం, పోలీస్ స్టేషన్ నుంచి స్టేటస్ రిపోర్టు తీసుకోకపోవడాన్ని ప్రస్తావించింది. ఫిర్యాదులో సంజ్ఞేయ నేరం వెల్లడవుతోందా లేదా అనే ప్రధాన అంశాన్ని పరిశీలించకుండా మెజిస్ట్రేట్ కోర్టు పౌరసత్వ అంశంపై దృష్టి మళ్లించిందని కూడా సెషన్స్ కోర్టు పేర్కొంది. తాజా ఆదేశాలతో సోనియా గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు అయిందని కాదు. ఫిర్యాదును మెజిస్ట్రేట్ కోర్టు మళ్లీ పరిశీలించి, పోలీసుల వాదనలు, సంబంధిత నివేదికను పరిగణనలోకి తీసుకుని చట్ట ప్రకారం నిర్ణయం తీసుకోవాల్సి ఉం



# గణనాథుడికి పల్లకీ సేవ

**శెనార్తిమీడియా, కరీంనగర్:** విద్యానగర్ కమిటీ ఆధ్వర్యంలో గణనాథుని పల్లకీ సేవను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ముప్పిడి మల్లారెడ్డి, కమిటీ సభ్యులు మహేందర్ రెడ్డి, కృష్ణారెడ్డి, లక్ష్మణరావు, నారాయణరావు, జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# విజన్ హైస్కూల్ వినాయకుడికి 108 ప్రసాదాలు

**శెనార్తిమీడియా, కరీంనగర్ :**

కొత్తపల్లి మండలం రేకుర్తి విజన్ హైస్కూల్ లో వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రతిరోజు విద్యార్థులతో కలిసి వైభవంగా జరుపుకుంటున్నారు. సోమవారం వినాయకుడికి మహా నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమానికి స్కూల్ కరస్పాండెంట్ సిరిపురం ప్రసాద్ హాజరై వినాయక పూజలో పాల్గొని 108 రకాల నైవేద్యాలు సమర్పించారు. విద్యార్థులు గణనాథుడి ఆకృతిలో కూర్చుని అలరించారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ సందవేణి వెంకట్, ఇంచార్జి ప్రతిభాభారతి, టీచర్స్ పాల్గొన్నారు.






# స్వయంభూ గణపతికి పూజలు



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

మండలంలోని మొలంగూర్ గ్రామ నామణి గుట్ట బండ వద్ద స్వయంభువుగా వెలసిన గణపతికి సోమవారం చుట్టు పక్కల రైతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో గణపతిని పూజించి, భక్తి పాటలు ఆలపిస్తూ భజనలు చేశారు. అనంతరం భక్తుల కోసం అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.



# ఎస్సారెస్పీ నుంచి నీటిని విడుదల చేయాలి

**శెనార్తి మీడియా, శంకరపట్నం:** శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్సారెస్పీ) నుంచి వెంటనే నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్‌లో బీజేపీ, హిందూ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాకు బీజేపీ శంకరపట్నం మండల అధ్యక్షుడు ఏనుగుల అనిల్ ఆధ్వర్యంలో నాయకులు తరలివెళ్లారు. ప్రభుత్వం స్పందించకపోతే రైతులు, హిందూ సమాజం తరపున ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాకు వెళ్లిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ నెంబర్. దండు. కొమురయ్య, మండల ఉపాధక్షుడు రాసమల్ల శ్రీనివాస్, మండల కోశాధికారి బోడ. తిరుపతి,మందాడి జగ్గారెడ్డి, సంపత్, మండల సోషల్ మీడియా కన్వీనర్ కునారపు శ్రీనాథ్, మేడిశెట్టి రాజేష్ బొజ్జ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం




**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఉత్తమ సేవలందిస్తున్న 21 మంది ఉపాధ్యాయులతో పాటు మెట్పల్లి సీఆర్పీ తిరుపతిని సోమవారం ఘనంగా సన్మానించారు. కేశవపట్నం మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపల్ సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మండల విద్యాధికారి లక్ష్మీనారాయణ, తహసీల్దార్ సురేఖ ఆధ్వర్యంలో పురస్కారాలు, ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ విద్యారంగంలో ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయులను గుర్తించి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కా రాలు అందిస్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ పాఠశాలలు, కళా శాలల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించి, జిల్లాలో శంకరపట్నం మండలాన్ని ప్రథ మ స్థానంలో నిలపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యూపీఎస్, పీఎస్, జడ్పీ హెచ్ఎస్, కేజీబీవీ పాఠశాలల ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# భూభారతి రీ సర్వేకు రైతులు సహకరించాలి

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

భూభారతి రీ సర్వే కార్యక్రమానికి రైతులందరూ సహకరించాలని ఏడీ కిషన్‌రావు సూచించారు. మండలంలోని రాజాపూర్ గ్రామంలో సోమవారం తహసీల్దార్ సురేఖ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించి రైతులకు రీ సర్వేపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సురేఖ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భూభారతి రీ సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. రీ సర్వే ద్వారా ఏళ్ల తరబడి పరిష్కారం కాకుండా ఉన్న భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉందన్నారు. గ్రామస్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రీ సర్వే ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు అధికారులు, రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ ఐ రాములు, సర్వేర్ మనోజ్ రావు, సర్పంచ్ కొంకటి రవి, హుజురాబాద్ మార్కెట్ చైర్మన్ నాంపల్లి తిరుపతి, ఉప సర్పంచ్ నరహరి రజిని, తిరుమల్‌రెడ్డి, ఏఈఓ రాజకుమార్, జిపిఓ రాజు,కార్యదర్శి శ్రీకాంత్, మాజీ ఉపసర్పంచ్ కుర్రె ఎల్లయ్య, వార్డు సభ్యులు తోట్ల అశోక్, రేసు రజిని, గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# ఆముదాలపల్లిలో ఫారం పాండ్ పనులు ప్రారంభం



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

మండలంలోని ఆముదాలపల్లి గ్రామంలో శ్మశానవాటిక సమీపంలో ఫారం పాండ్ నిర్మాణ పనులను ప్రారంభించారు. గ్రామంలో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు అవసరమైన సమయంలో నీటిని వినియోగించుకునేలా ఈ పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తాళ్లపెల్లి మొగిలి గౌడ్, ఉప సర్పంచ్ దొంగల రమేష్, పంచాయతీ కార్యదర్శి నవీన్ చైతన్య పాల్గొన్నారు.



# తాడికల్ సర్పంచ్ సుజాతకు నివాళి

**శెనార్తి మీడియా, శంకరపట్నం:** మండలంలోని తాడికల్ గ్రామానికి చెందిన సర్పంచ్ దుర్గపు సుజాత సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే డా. రసమయి బాలకిషన్ తాడికల్ గ్రామానికి వెళ్లి సుజాత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులు అధైర్యపడవద్దని, వారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంట మైపాల్, మాజీ జడ్పీటీసీలు పొద్దుటూరి సంజీవరెడ్డి, లింగంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ చౌడమల్ల వీరస్వామి, కొయ్యడ పరుశురాములు, రమేష్ శ్రీకాంత్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

# బాధిత కుటుంబాలకు పరామర్శ



**శెనార్తి మీడియా, బెజ్జంకి :** బేగంపేట, గూడెం గ్రామాల్లో ఇటీవల పలువురు మృతి చెందగా బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సోమవారం పరామర్శించి, ఓదార్చారు. ఆయన వెంట మండల అధ్య క్షుడు పాకాల మహిపాల్ రెడ్డి, నాయకులు లింగాల లక్ష్మణ్, చింతకింది శ్రీనివాస్ గుప్తా,కనగండ్ల తిరుపతి, ముక్కిస లక్ష్మారెడ్డి, చింతలపల్లి సంజీవరెడ్డి, ఎల శేఖర్ బాబు, గూడెం ఉపసర్పంచ్ యాలా ల పరుశురాం, కొరివి తిరు పతి, బుర్ర అంజయ్య గౌడ్, బెజ్జంకి శంకర్, పోచయ్య, శ్రీనివాస్ గౌడ్, జనగాం రాజ్ కుమార్, కనకయ్య గౌడుగు, కనకయ్య, ముత్యాల వెంకటరెడ్డి, గౌరయ్య, తిరుపతి, సుధా కర్, మల్లేశం, బెజ్జంకి రఘు, బెజ్జంకి రాజమల్లు, బాబు, అంతయ్య తదితరులు పాల్గొన్నారు.

# అనాథాశ్రమంలో గజముఖ ఫ్రెండ్స్ యూత్ అన్నదానం

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

వినాయక చవితి వేడుకలను ఆడంబరాలకు పరిమితం చేయకుండా సేవా కార్యక్రమాలతో నిర్వహిస్తూ గజముఖ ఫ్రెండ్స్ యూత్ ఆదర్శంగా నిలిచింది. 27వ విఘ్నేశ్వర నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆముదాలపల్లి యువత సెప్టెంబర్ 20న జమ్మికుంటలోని స్పందన అనాథాశ్రమాన్ని సందర్శించి అనాథ పిల్లలకు అన్నదానం చేశారు. యువత స్వయంగా పిల్లలకు భోజనం వడ్డించి వారితో ఆప్యాయంగా గడిపారు. ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడం ద్వారా మానవత్వాన్ని చాటుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు గజముఖ ఫ్రెండ్స్ యూత్ సభ్యులను అభినందించారు. వినాయక చవితి



వేడుకలు కేవలం పూజలు, అలంకరణలకే పరిమితం కాకుండా సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలతో నిర్వహించాలనే సందేశాన్ని యువత చాటిచెప్పింది. “ఆకలితో ఉన్న మనిషి కడుపు నింపడం కూడా ఒక పూజే” అనే ఆలోచనతో చేపట్టిన అన్నదానం సేవాభావానికి నిదర్శనంగా నిలిచింది.

# వినాయక మండపం వద్ద అన్నదానం

**శెనార్తి మీడియా, బెజ్జంకి:**

తోటపల్లి గ్రామంలోని కురుమవాడ వినాయక మండపం వద్ద వార్డు సభ్యురాలు ఏనుగుల అనిత అశోక్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ సర్పంచ్ బోయినపల్లి నర్సింగరావు హాజరై అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు ముత్తా బీరయ్య, దయ్యాల ఐలయ్య, ఉట్ల రాజు, నల్లగొండ రామయ్య, జనగాం లచ్చయ్య, మడ్డి సందీప్, గ్రామ పెద్దలు ఏనుగుల మల్లేశం, రేవోజు శ్రీనివాస్, మడ్డి శ్రీనివాస్, ఏనుగుల ఓజయ్య, ఐలయ్య, నర్సయ్యతో పాటు గ్రామ ప్రజలు, యువకులు పాల్గొన్నారు.





# చెట్ల కొమ్మల తొలగింపు

**శెనార్తి మీడియా శంకరపట్నం:** శంకరపట్నం మండల కేంద్రంలో గణేష్ నిమజ్జనానికి వెళ్లే ప్రధాన మార్గాల్లో అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను సర్పంచ్ గోదారి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం తొలగించారు. నిమజ్జన విగ్రహాలను తరలించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రహదారికి ఇరువైపులా అడ్డుగా ఉన్న కొమ్మలను నరికివేశారు.అలాగే చెట్ల కొమ్మలు విద్యుత్ వైర్లకు తగిలి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా, ఎలాంటి అవాంతరాలు లేకుండా జరిగేలా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు.

# హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

మండలంలోని కేశవపట్నం బస్టాండ్‌లో సోమవారం జనని కల్చర్ సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాప్తికి గల కారణాలు, నివారణ చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించారు. వ్యాధిపై ఉన్న అపోహలను వీడి, సరైన సమాచారాన్ని తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాగరాజు నాయక్, గంగాధర్ నాయక్, జాను, అంజలి, వనిత, మైత్రి వెల్ఫేర్ సొసైటీకి చెందిన డి. సప్న తదితరులు పాల్గొన్నారు.

# శిలాఫలకంపై సర్పంచ్ భర్త పేరు.. ఉపసర్పంచ్ అభ్యంతరం

**శెనార్తి మీడియా, శంకరపట్నం:** మండలంలోని కాచా పూర్ గ్రామం లో నూతన ఆరోగ్య ఉప కేంద్ర ప్రారంభోత్సవ శిలా ఫలకంపై సర్పంచ్ ఊకంటి మాధవి పేరుతో పాటు ఆమె భర్త ఊకంటి మధు కర్ పేరు చేర్చడంపై ఉప సర్పంచ్ లింగంపల్లి కృష్ణా రెడ్డి అభ్యంతరం వ్యక్తం చే శారు. శిలాఫల కంపై సర్పంచ్ భర్త పేరును చేర్చడం ప్రోటోకాల్ ఉల్లంఘన కాదా అంటూ మండల స్థాయి అధికారులను ప్రశ్నించారు. ఈ విషయంపై సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ చిత్రా మిశ్రాకు ఫిర్యాదు చేసినట్లు కృష్ణారెడ్డి తెలిపారు. ప్రోటోకాల్ ఉల్లంఘనకు బాధ్యులైన వారిపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు చెప్పారు.





# ఏకేశ్వరోపాసకులు గురు నానక్

## నేడు సిక్కు మత స్థాపకుని వర్ధంతి

పది మంది సిక్కు మత గురువుల్లో మొదటి వాడు, సిక్కు మత స్థాపకుడు గురు నానక్ దేవ్ జీ(1469-1539) 1469 నవంబర్ 29న తల్వాండీ గ్రామంలో (ప్రస్తుతం లాహోర్ సమీపంలోని నాన్కానా సాహెబ్) ఒక హిందూ కుటుంబంలో జన్మించాడు. ఆ ప్రాంతం ఇప్పుడు పాకిస్థాన్‌లో ఉంది. ఆయన తండ్రి మెహతా కలు ప్రభుత్వంలో భూ రెవెన్యూ వ్యవహారాల గుమాస్తాగా పనిచేసే హిందూ పట్వారీ. నానక్ తల్లి మాతా త్రిపుర, ఆయనకి బీబీ నాన్కీ అనే అక్క ఉన్నారు.గురు నానక్ దేవ్ జీ చిన్నతనం నుంచీ ప్రశ్నించే, ఆలోచించే తత్త్వంతో ఉండేవాడు. చిరు వయసులోనే మత పరంగా ఉపనయనం చేసి జంధ్యం వేయబోగా తిరస్కరించి, అంతకన్నా భగవంతుని నిజ నామాన్ని హృదయంలో ధరిస్తాననీ, నూలు పోగులా అది తెగి పోవడం, మట్టిలో కలిసిపోవడం, తగలబడడం, పోవడం లేక అఖండంగా రక్షణను ఇస్తుందనీ వాదించాడు. అత్యంత పిన్న వయసు నుంచీ బీబీ నాన్కీ తన తమ్ముడిలో భగవంతుని జ్యోతి చూడ గలిగేవాడు, కానీ ఈ రహస్యాన్ని ఎవరికీ చెప్పలేదు. ఆమె గురు నానక్ దేవ్ జీ తొలి శిష్యురాలిగా పేరొందారు. చిన్న తనం లోనే నానక్ హిందూ మతం లోని తాత్త్వికతపై ఆకర్షితుడై, జీవితం లోని రహస్యాలను అన్వేషించేందుకు ఇల్లు వదలి వెళ్ళి పోయారు. ఇదే సమయంలో నానక్ భారత దేశంలోని ముఖ్యులైన తాత్త్వికులు, బోధకులు కబీర్, రవిదాస్ (1440-1518)లను కలుసు కున్నారు. నానక్ బతాలాకు చెందిన వ్యాపారి మూల్ చంద్ చోనా కుమార్తె సులేఖ్నీని వివాహం చేసుకున్నారు, ఆయనకు శ్రీచంద్, లక్ష్మీదాస్ అనే కుమారులు జన్మించారు. ఆయన అక్క నాన్కీ భర్త, బావగారైన జైరాం నానక్ కు సుల్తాన్ పూర్ లో ప్రభుత్వ ధాన్యా గారంలో మేనేజరుగా ఉద్యోగం ఇప్పించారు. 28 సంవత్సరాల వయసులో ఒక ఉదయం గురు నానక్ దేవ్ సామాన్యంగా నదికి స్నానం చేసి, ధ్యానం చేసుకు నేందుకు వెళ్ళాడు. ఆ తర్వాత ఆయన మూడురోజుల పాటు ఎవరికి కనిపించకుండా పోయాడు. తిరిగి వచ్చాక ఆయన "దేవుని పవిత్రాత్మను నింపుకున్నాను" అన్నాడు. ఆయన తిరిగివచ్చాకా తొలి మాటల్లో ఒకటి: హిందువూ లేడు, ముస్లిమూ లేడు. ఈ మత సామరస్య బోధలతో ఆయన బోధలు వ్యాపింప జేయడం ప్రారంభించాడు. నానక్ హిందూ, ఇస్లామియా మత గ్రంథాలు చదివాడు కానీ, ఈ రెండు మతాలకి భిన్నమైన సిక్కు మతమును స్థాపించాడు. సిక్కు మతం ఏకేశ్వరోపాసక మతము. వీరు ఏక్ ఓంకార్ (ఏకైక దేవుడు) ని నమ్మతారు. ఏకేశ్వరోపాసనను ప్రబోధించి కుల వ్యవస్థను వ్యతిరేకించిన గురువు. నానక్ తరువాత గురు పరంపర కొన సాగింది. ఐదవ గురువు అర్జున్, తనకు ముందు గురువులకు దైవం అనుగ్రహించిన సూక్తులను, బోధలను సంకలనం చేసి "గురు గ్రంథ సాహిబ్" పవిత్ర గ్రంథానికి రూప కల్పన చేశాడు. వేల కొద్దీ కిలో మీటర్లను చుడుతూ భగవంతుని సందేశాన్ని ప్రబోధిస్తూ నాలుగు సుస్పష్టమైన ప్రధాన దిశల్లో నాలుగు ప్రత్యేకమైన ప్రయాణాలు సాగించాడు, వీటినే ఉదాసీలు అని పిలుస్తారు. గురు నానక్ తన జీవిత చివరి సంవత్సరాల్లో ఉచిత ప్రసాదం లభించే కర్తార్ పూర్ లో జీవించారు. తన ఆహారాన్ని మత భేదం, కుల భేదం, ధన భేదం లేకుండా పంచు కోడాన్ని ఆచరించే వారు గురు నానక్. గురు నానక్ పొలాల్లో పనిచేసి జీవిక సాగించే వాడు. కొత్త సిక్కు గురువుగా భాయ్ లెహ్నాను ప్రకటించాక సెప్టెంబరు 22న 1539లో 70వ ఏట కర్తార్ పూర్ , మొఘల్ సామ్రాజ్యం (ప్రస్తుత పాకిస్తాన్)లో మరణించాడు. చివరి సంవత్సరాల 55 ఏళ్ళ వయసు వరకు, నానక్ కర్తార్‌పూర్‌లో స్థిరపడి, మరణించే వరకు అక్కడే నివసించాడు. ఈ కాలంలో, అతను అచల్‌లోని నాథ్ యోగి కేంద్రానికి, మరియు పాక్‌పట్టన్ మరియు ముల్తాన్ యొక్క సూఫీ కేంద్రాలకు స్వల్ప ప్రయాణాలు చేశాడు. మరణించే సమయానికి, నానక్ పంజాబ్ ప్రాంతంలో అనేక మంది అనుచరులను సంపాదించాడు. నానక్ మాటలు 974 కవితా శ్లోకాలు లేదా శబ్ద రూపంలో సిక్కు మతం యొక్క పవిత్ర గ్రంథమైన గురు గ్రంథ్ సాహిబ్‌లో నమోదు చేయ బడ్డాయి. కేవలం పంజాబీలు మాత్రమే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా అనేకమంది గురు నానక్‌ను ఆరాధిస్తారు. సిక్కులు ఏకేశ్వరోపాసన చేస్తారు. ఓంకారాన్ని ఏకైక దేవునిగా పూజిస్తారు. గురు నానక్ వర్ధంతి సందర్భంగా గురు ద్వారాల్లో సిక్కులు పవిత్ర మత గ్రంథంగా భావించే "గురు గ్రంథ సాహిబ్" ను 48 గంటల పాటు నిరంతరంగా పఠిస్తారు. ఇలా చదవడాన్ని "అఖండ పఠనం" అంటారు. గురునానక్ దేవ్ మరణించటానికి ముందు సుమారు 18 ఏళ్ల పాటు ఆ ప్రాంతంలోనే ఉన్నాడని, సిక్కు మతస్తులను కూడా తొలిసారి ఇక్కడే సమావేశ పరిచారని చెబుతుంటారు. తమ మత గురువు శాశ్వత విశ్రాంతి తీసుకున్న ఈ గురుద్వారా అంటే సిక్కులకు ఎంతో భక్తి. దీంతో నాటి పాటియాలా మహారాజు, పంజాబ్ సీఎం కెప్టెన్ అమరీందర్ సింగ్ తాత భూపిందర్ సింగ్ పునర్నిర్మించారు. ఈ కర్తార్‌పూర్ సాహిబ్ ఓసారి వరదల వల్ల డ్యామేజ్ అయింది. పాకిస్థాన్ ప్రెసిడెంట్ జనరల్ పర్వేజ్ ముషారఫ్ హయాంలో పునరుద్ధ రించ బడింది. ఈ పుణ్య క్షేత్రాన్ని ఇండియా బోర్డర్ నుంచి డైరెక్ట్‌గా చూడవచ్చు. గురుద్వారా కనిపించకుండా చుట్టు పక్కల అడ్డంగా ఉండే పొడవైన చెట్లను పాకిస్థాన్ వాళ్లు ఎప్పటి కప్పుడు కొడుతుంటారు. ఇండియా నుంచి సిక్కులు కర్తార్‌పూర్ గురుద్వారా సందర్శనకు ఏటా ముఖ్యంగా నాలుగు సార్లు వెళు తుంటారు. ఒకటి.. బైశాఖి పండగ సందర్భంగా. రెండు.. సిక్కుల ఐదో గురువు అర్జున్ దేవ్ అమరుడైన రోజు. మూడు.. మహా రాజా రంజిత్ సింగ్ వర్ధంతి నాడు. నాలుగు.. గురు నానక్ దేవ్ జయంతి రోజు. ఈ నాలుగు సందర్భాల్లో మన దేశ భక్తులు పాకిస్థాన్ లోని అన్ని గురు ద్వారాలకూ వెళ్లేందుకు డైరెక్ట్ యాక్సెస్ ఉంటుంది. మూడు కిలోమీటర్లు వెళితే ఈ మందిరానికి చేరుకోవచ్చు. ఈ మార్గంలో ఇండియా, పాకిస్థాన్ మధ్య రావి నది పారుతోంది. దీన్ని దాటి వెళ్లాలంటే బ్రిడ్జ్ కట్టాలి. ఈ కారిడార్‌ను ఇండియా.. పంజాబ్ రాష్ట్రం గురుదాస్ పూర్ జిల్లాలోని డేరా బాబా నానక్ నుంచి నిర్మించాల్సి ఉంది. కారిడార్ నిర్మాణానికి గత ఏడాది నవంబర్ 26న ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు శంకుస్థాపన చేశారు. రెండు రోజుల తర్వాత పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ శ్రీకారం చుట్టారు. నాటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి నాయకత్వంలో లాహోర్ కు బస్సు యాత్ర జరిగింది. అప్పటి నుంచి రెండు దేశాల మధ్య రోడ్డు, రైలు సదుపాయాలు వచ్చాయి. వివిధ దేశాల భక్తులు గురు ద్వారాకు బస్సుల్లో వెళ్లేటప్పుడు పాకిస్థాన్ రేంజర్లు ఆర్మీ కాన్వాయ్‌తో ఫుల్ సెక్యూరిటీ కల్పిస్తారు. కర్తార్‌పూర్ కారిడార్ నిర్మాణం పూర్తైతే బోర్డర్ క్రాసింగ్ లింకేజ్ రోడ్డు అందుబాటు లోకి వస్తే మన దేశం నుంచి భక్తులు గురుద్వారా దర్బార్ సాహిబ్‌కి నేరుగా చేరుకోవచ్చు. భారతీయులకు పాస్ పోర్టులు, వీసాలు లేకుండానే యాత్రలో పాల్గొనేందుకు వీలుంటుంది. గురునానక్ దేవ్ 483వ వర్ధంతి (సెప్టెంబరు 22) సందర్భంగా కర్తార్‌పూర్‌లోని గురుద్వారా దర్బార్ సాహిబ్‌ను సిక్కు భక్తులు సందర్శించేందుకు పాకిస్థాన్ ప్రభుత్వం అనుమతించింది. కరోనా నేపథ్యంలో వచ్చే భక్తులకు పూర్తిస్థాయి వ్యాక్సినేషను ధ్రువపత్రాలను తప్పనిసరి చేశారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# క్యాన్సర్ గురించి అవగాహన అవసరం

## నేడు క్యాన్సర్ రోగుల సంక్షేమ దినం



కాన్సర్ గురించి అవగాహన పెంపొందించడానికి, దాని నివారణ, గుర్తింపును, చికిత్సను ప్రోత్సహించేందుకు సెప్టెంబర్ 22న ప్రపంచ క్యాన్సర్ రోగుల సంక్షేమ దినంగా జరుపుకుంటారు. 'ఇంటర్నేషనల్ యూనియన్ ఎగెనెస్ట్ క్యాన్సర్ సంస్థ ప్రజలలోకి క్యాన్సర్ అవగాహనను తీసుకెళ్లేందుకు కృషి ప్రారంభించింది. ఆ సంస్థలో మొత్తం 100 దేశాలు, క్యాన్సర్ వ్యాధి మీద యుద్ధం చేస్తున్న 350 సంస్థలు సభ్యత్వం కలిగి ఉన్నాయి. వీరందరూ మీడియా ద్వారా క్యాన్సర్ వ్యాధి ప్రమాదాన్ని ప్రచారం చేయాలని పాలనా విధానాలలో క్యాన్సర్ వ్యతిరేక చర్యలు చేపట్టేల ప్రభుత్వాల మీద ఒత్తిడి తేవటం కూడా వారు చేస్తున్న పని. అసలు క్యాన్సర్ అంటే ఏమిటి సాధారణంగా మన శరీరంలో కణ విభజనలు ఒక క్రమ పద్ధతిలో నియంత్రించ బడతాయి. కొన్ని సందర్భాలలో కణాల పెరుగుదలలో నియంత్రణ లేనందువల్ల కణాలు చాలా వేగంగా అస్తవ్యస్తంగా విభజన చెంది కణ సమూహాలను ఏర్పరుస్తాయి. ఈ కణ సమూహాలను 'కంతి' అంటారు. అటువంటి కొన్ని ప్రమాదకరమైన వాటిని కేన్సర్ అని వ్యవహరిస్తారు. ఈ రకమైన పెరుగుదలకు ఒక స్పష్టమైన విధి ఉండదు. కేన్సర్ గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని 'ఆంకాలజీ' అంటారు. క్యా న్సర్ ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన వ్యాధి. క్యాన్సర్ మహమ్మారి ఏటా రూ.41, 17,000 కోట్లు హరిస్తూ ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. మూడింట రెండొంతుల క్యాన్సర్ మరణాలు పేద, మధ్యతరగతి దేశాల్లోనే సంభవిస్తున్నాయి. అందులో ఎక్కువ భాగం ముందుగా గుర్తించి చికిత్స అందించడం ద్వారా నయంచేయొచ్చని డబ్ల్యూహెచ్ఓ(WHO) వెల్లడించింది. క్యాన్సర్ అనేది ఏ వయస్సు వారి కైనా రావచ్చును. ఆడవారికి మగవారికి కూడ రావచ్చును. శరీరములో నోరు, గొంతు, ఎముకలు, రొమ్ము, చర్మము మున్నగు ఏ భాగానికి అయినా రావచ్చును. శరీరంలో ఏదైనా అవయవానికి కేన్సర్ సోకితే తొలిదశలో లక్షణాలు అంతగా కనిపించవు. వ్యాధి సోకిన అవయవాన్ని బట్టి దీని నిర్ధరణ పరీక్షలు కూడా వేర్వేరుగా ఉంటాయి. కొన్ని రకాల క్యాన్సర్లనూ ఒకే విధమైన పరీక్షతో తెలుసు కోవడం సాధ్యం కాదు. క్యాన్సర్ అంటువ్యాధి కాదు. అలాగే వంశపారం పర్యంగా వచ్చే అవకాశం కూడా తక్కువే. అయితే, రొమ్ము, థైరాయిడ్, పెద్దపేగు, పాంక్రియాస్ క్యాన్సర్లు జన్యు పరంగా సంక్రమిస్తాయి. కుటుంబంలో ఎవరికైనా ఈ క్యాన్సర్లు వస్తే వచ్చే ప్రమాదం ఉంది. క్యాన్సర్‌ను తొలి దశలో గుర్తించక పోతే ఇతర భాగాలకూ వ్యాపించి, చికిత్సకు సైతం ఏమాత్రం తగ్గుముఖం పట్టవు. కాబట్టి దీనిపై అవగాహనతో ఎదుర్కొవాలి. కేన్సర్‌కు కారణాల్లో ఆధునిక జీవన శైలి ప్రధానమైంది. మద్యం, పొగతాగడం, ఆహార పదార్థాల్లో రంగులు వినియోగం, రసాయనాలు వాడటం, హార్మోన్లు అధికంగా వాడటం, అధిక బరువు, కాలుష్యం, క్రిమిసంహారకాలు, చికిత్సలో భాగంగా లేదా ప్రమాద వశాత్తు రేడియేషన్‌కు గురికావడం, తరచూ వేధించే ఇన్ఫెక్షన్లు.. ఇవన్నీ క్యాన్సర్‌కు కారకాలు. కొన్ని రకాల కేన్సర్లను రాకుండా వ్యాక్సిన్ వేసుకోవచ్చు. వాటిలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కు ప్రధాన కారణం హెచ్‌పీవీ వైరస్. కాబట్టి దీనికి వ్యాక్సిన్ వేసుకుని నివారించ వచ్చు. 9 ఏళ్లు పైబడిన బాలికల నుంచి 40 ఏళ్ల మహిళల వరకు ఈ వ్యాక్సిన్ వేయించు కోవచ్చు. అలాగే అండాశయం, గొంతు క్యాన్సర్ రాకుండా కూడా ఇది అడ్డుకుంటుంది. క్యాన్సర్ కణం ఒక్కొక్కరిలో ఒక్కోలా ఉంటుంది. కేన్సర్‌ను తొలి దశలోనే గుర్తించడం, దానికి ఇతర అవయవాలకు విస్తరించే గుణం ఉందా అనే అంశాలపై ఆధారపడి ఉంటుంది. సర్జరీ, మందులు, థెరపీలు కూడా దీనిపైనే ఆధారపడి ఉంటాయి. క్యాన్సర్‌ను జయించడం, త్వరగా గుర్తించడంతో పాటు ఆ కణితులు పరిమాణం, దశ, గ్రేడింగ్ కూడా చాలా ముఖ్యం. కాన్సర్‌కు వయసుతో సంబంధం లేదు. అన్ని వయసుల వారూ దీని బారిన పడే అవకాశాలు మెండుగా ఉంటాయి. కానీ చిన్నపిల్లల్లో వచ్చే క్యాన్సర్లను చాలా వరకు పూర్తిగా నయం చేయ గలిగినవే. అయితే, వయస్సు పెరిగేకొద్దీ కేన్సర్స్ వచ్చే ముప్పు ఎక్కువ. ఈ సమయంలో వచ్చే కేన్సర్ల తీవ్రత చాలా ఎక్కువగా ఉంటుంది. అందుకే కేన్సర్ చికిత్సను కూడా వయస్సును బట్టి నిర్ధరిస్తారు. క్యాన్సర్ కణాలను నిర్వీర్యం చేయడానికి కీమోథెరపీ, రేడియో థెరపీలతో పాటు ల్యాప్రోస్కోపిక్ పద్ధతిలో చేసే కీహోల్ సర్జరీలు కూడా నేడు అందుబాటులో ఉన్నాయి. సర్జరీ తర్వాత రేడియో, కీమో, హార్మోన్ థెరఫీ లాంటివి చేసినా, లేక థెరపీల తర్వాత సర్జరీ చేసినా చికిత్స అంతటితో అయి పోయిందని భావించరాదు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించు కోవాలి. క్యాన్సర్ కణం శరీరంలో ఎక్కడుందనే విషయం తెలుసు కోవడం కష్టం. ఏ అవయవానికి సోకిందనే అనుమానం ఉంటే దానికి సంబంధించిన పరీక్షలు వేర్వేరుగా ఉంటాయి. వీటిలో బయాప్సీ, యఫ్‌యన్‌ఏ టెస్ట్, బ్లడ్ మార్కర్స్, ఎక్స్-రే, సీటీ స్కాన్, యంఆర్ఐ, పీఈటీ స్కాన్ వంటివి అవసరాన్ని బట్టి చేస్తారు. అయితే సర్వైకల్ క్యాన్సర్‌ను పాప్‌స్మియర్ ద్వారా ముందుగా గుర్తించవచ్చు. ప్రభుత్వాలు చర్యలలో భాగంగా పొగాకు వాడకంపై యుద్ధం ప్రకటించడం, సిగరెట్ తయారీ కంపెనీలు వ్యాపార ప్రకటనలు ఇవ్వటాన్ని నిషేధించాయి. అదే విధంగా బీడీ కట్టల మీద పుర్రె గుర్తు ముద్రణతో క్యాన్సర్ భయాన్ని ప్రజలలోకి తీసుకువెళ్ళ గలిగారు. మత్తు పానీయ ప్రకటనల మీద నిషేధం తీసుకు వచ్చారు. మన దేశంలో నోటి క్యాన్సర్ కేసులు అధికంగా నమోదవటానికి కారణం గుట్కా వాడకమే. భారత దేశంలో 80 శాతం మందికి క్యాన్సర్ ముందుగా గుర్తు పట్టలేక పోతున్నారు. క్యాన్సర్ పై అవగాహన పెరగాలి. లేటు వయస్సు వారికి ఎక్కువగా క్యాన్సర్ వస్తున్నది. నేడు లైఫ్ స్టైల్ మారింది. పొగాకు సంబంధిత వస్తువులు వాడటం వల్ల 40శాతం మందికి క్యాన్సర్ వస్తున్నదని తెలుస్తున్నది. చికిత్సకు సంబంధించి నిర్ణయాలు మూడు విషయాలపై ఆధారపడి వుంటాయి. శరీర సాధారణ స్థితి, ఇతర జబ్బులు, కాన్సరు దశ, రోగి కోరిక, సమ్మతి. తొలిదశలో వున్న కాన్సర్లలో 70 నుంచి 90 శాతం కేసుల్లో నయం అయ్యే అవకాశం వుంది. కాన్సరు చికిత్సలో 19వ శతాబ్దం చివరిదశలో కాన్సరుకు శస్త్ర చికిత్స ప్రారంభమైంది. అయితే కాన్సరుకు శస్త్ర చికిత్స రానురాను వయస్సు పెరిగిన కొద్దీ తగ్గిపోతున్నది. రేడియేషన్ చికిత్స ఎక్స్రేను కనుగొన్న 1895 నుండి జరుప బడుతున్నది. వృద్ధుల్లో కాన్సరు జబ్బుకు రేడియేషన్ చికిత్సను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. కాన్సరుకు మందులతో చికిత్స 1950 నుండి ప్రారంభమైంది. వృద్ధుల్లో కాన్సరు చికిత్సకు మందులను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. క్యాన్సర్ కష్ట నష్టాల గురించి ప్రజలకు తెలియ జేసి అవగాహన కల్పిచాలి , కాన్సర్ వ్యాధిని నయం చేయడానికి శస్త్ర చికిత్స, రేడియేషన్, కీమోథెరపీ అవసరం. ఆరోగ్యపు అలవాట్లను, ఆహారపు అలవాట్లను 30 నుంచి 40 ఏళ్ల వయస్సు నుంచే ప్రారంభించాలి. తొలిదశలోనే కాన్సరును గుర్తించి చికిత్స పొందాలి. ధూమపానం, సురాపానం, గుల్కా, జర్దాకిల్లీలు మానాలి. పండ్లు, కూరగాయలు పీచు పదార్థం ఎక్కువగానూ, కొవ్వు తక్కువగానూ వుండే ఆహారాన్ని తీసుకోవాలి. కాన్సరు బారినుండి శరీరాన్ని రక్షించు కోవాలి. దీనికి స్క్రీనింగ్ పరీక్షలు జరపాలి.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# ప్రహ్లాద యూత్ విఘ్నేశ్వరుడిని దర్శించుకున్న మేయర్ కొలగాని



నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీ రోడ్ నంబర్ 4లో ప్రహ్లాద యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వర మండపాన్ని కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మండపం నిర్వాహకులు, కాలనీ పెద్దలు మేయర్‌కు స్వాగతం పలికారు. అనంతరం విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. పూజల అనంతరం మండపం నిర్వాహకులు మేయర్‌ను సన్మానించారు.

శెనార్తి మీడియా, కరీంనగర్:





# సీఎస్‌కే కొత్త హెడ్ కోచ్‌గా జహీర్ ఖాన్

- ధోనీ సిఫారసుతో బాధ్యతలు
- స్టీఫెన్ ఫ్లెమింగ్ 18 ఏళ్ల శకానికి ముగింపు
- ఐపీఎల్ 2027 సీజన్ నుంచి కొత్త బాధ్యతలు చేపట్టనున్న భారత మాజీ పేసర్




**చెన్నై, సెప్టెంబర్ 21 (చురకలు):** ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన ఫ్రాంచైజీల్లో ైన చెన్నై సూపర్ కింగ్స్ (CSK) తమ కోచింగ్ విభాగంలో చారిత్రాత్మక మార్పుకు శ్రీకారం చుట్టింది. భారత మాజీ స్పీడ్ స్టార్ జహీర్ ఖాన్‌ను జట్టు నూతన హెడ్ కోచ్‌గా నియమిస్తున్నట్లు సీఎస్‌కే యాజమాన్యం సోమవారం అధికారికంగా ప్రకటించింది. 'Left Arm »»Taking□□ Over! Welcoming Zaheer Khan as the Head Coach of Chennai Super Kings!" అంటూ సోషల్ మీడియా వేదికగా ఆయనకు ఘనంగా స్వాగతం పలికింది. 2009 నుంచి సుదీర్ఘంగా 18 సంవత్సరాల పాటు సీఎస్‌కే ప్రధాన కోచ్‌గా వ్యవహరించి, జట్టుకు ఐదు ఐపీఎల్ టైటిళ్లు సాధించిపెట్టిన స్టీఫెన్ ఫ్లెమింగ్ స్థానంలో జహీర్ ఖాన్ బాధ్యతలు స్వీకరించనున్నారు.

### ధోనీ నేతృత్వంలోనే ముగిసిన అన్వేషణ

స్టీఫెన్ ఫ్లెమింగ్ తప్పుకున్న తర్వాత స్థానిక (భారత) కోచ్‌కే ప్రాధాన్యమివ్వాలని నిర్ణయించిన యాజమాన్యం, కొత్త హెడ్ కోచ్‌ను ఎంపిక చేసే బాధ్యతను ఎంఎస్ ధోనీకే అప్పగించింది. అంతర్జాతీయ స్థాయిలో, ఐపీఎల్‌లో జహీర్ ఖాన్‌కున్న క్రికెటింగ్ మేధస్సుపై పూర్తి నమ్మకంతో ధోనీ ఆయన పేరును ప్రతిపాదించగా.. జట్టు ఓనర్ రూపా గురునాథ్, కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్, ఎండీ కాశీ విశ్వనాథన్‌లతో కూడిన కమిటీ దీనికి ఆమోదం తెలిపింది. గతంలో ముంబై ఇండియన్స్ డైరెక్టర్ ఆఫ్ క్రికెట్ ఆపరేషన్స్‌గా, లక్నో సూపర్ జెయింట్స్ మెంటార్‌గా వ్యవహరించిన అనుభవం జహీర్‌కు ఉంది.

### సీఎస్‌కేలో నూతన అధ్యాయం

సీఎస్‌కే హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టడంపై జహీర్ ఖాన్ ఆనందం వ్యక్తం చేశారు. "ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత విజయవంతమైన జట్టులో భాగమవ్వడం గౌరవంగా భావిస్తున్నాను. ఆటగాడిగా చెపాక్‌లో సీఎస్‌కేను ఎదుర్కొన్న అనుభవాలు అద్భుతమైనవి. అక్కడి 'సూపర్‌ఫ్యాన్స్' సృష్టించే వాతావరణం ప్రత్యేకం" అని జహీర్ పేర్కొన్నారు. 2010, 2011, 2018, 2021, 2023లలో ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన సీఎస్‌కే, గత మూడు సీజన్లలో అను అనుకున్న స్థాయిలో రాణించలేకపోయింది. ఈ నేపథ్యంలో 2027 ఐపీఎల్ సీజన్‌కు ముందే జట్టు నిర్మాణం, యువ బౌలర్లను తీర్చిదిద్దడం, వేలం వ్యూహాలు ఖరారు చేయడం జహీర్ ఖాన్ ముందున్న ప్రధాన లక్ష్యాలు.




# విదేశాల్లో ఆ ఇద్దరూ మెరుగుపడాలి

## సందీప్ పాటిల్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 21 (చురకలు):** భారత క్రికెట్‌లో దూకుడైన బ్యాటింగ్‌తో ఆకట్టుకుంటున్న యువ ఆటగాళ్లు అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీలపై మాజీ భారత ఆల్‌రౌండర్ సందీప్ పాటిల్ ప్రశంసలు కురిపించారు. ఇద్దరిలోనూ అద్భుతమైన ప్రతిభ, భారీ షాట్లు ఆడే సామర్థ్యం ఉందని పేర్కొన్నారు. అయితే విదేశీ పరిస్థితుల్లో తమ ఆటను మరింత మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. స్వదేశంలో బంతిని ఎదుర్కొనే సమయంలో అభిషేక్, వైభవ్ ఎంతో దూకుడుగా కనిపిస్తున్నారని పాటిల్ అన్నారు. అయితే బంతి స్వింగ్ అవుతున్న పరిస్థితుల్లో ఇద్దరూ కొంత ఇబ్బంది పడుతున్నట్లు కనిపించిందని పేర్కొన్నారు. ముఖ్యంగా ఇంగ్లాండ్ పర్యటనలో ఈ విషయం స్పష్టమైందని చెప్పారు. విదేశీ పిచ్‌లపై పరిస్థితులకు అనుగుణంగా బ్యాటింగ్ శైలిని మార్చుకోవడం యువ ఆటగాళ్లకు ఎంతో ముఖ్యమని సూచించారు. జులైలో జరిగిన ఇంగ్లాండ్ టీ20 సిరీస్‌లో అభిషేక్ శర్మ ఐదు మ్యాచ్‌ల్లో 131 పరుగులు చేశాడు. అదే సిరీస్‌లో వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ టీ20ల్లో అరంగేట్రం చేసి మూడు మ్యాచ్‌ల్లో 42 పరుగులు సాధించాడు. స్వింగ్‌కు అనుకూలమైన పరిస్థితుల్లో వారి బ్యాటింగ్‌పై సందేహాలు వ్యక్తమైనప్పటికీ, ఆ తర్వాతి మ్యాచ్‌ల్లో ఇద్దరూ తమ సత్తాను చాటుకున్నారు. జింబాబ్వేతో జరిగిన టీ20 సిరీస్‌లో వైభవ్ సూర్యవంశీ ఆకట్టుకోగా, భారత్ సిరీస్‌ను 3-0తో కైవసం చేసుకున్న సమయంలో అతడు అత్యుత్తమ ఆటగాడిగా నిలిచాడు. మరోవైపు అఫ్గానిస్థాన్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో అభిషేక్ శర్మ తన బ్యాటింగ్ సత్తాను మరోసారి చాటాడు. చివరి మ్యాచ్‌లో కేవలం 30 బంతుల్లోనే శతకం సాధించి సంచలనం సృష్టించాడు. అభిషేక్ నుంచి ఇలాంటి ఇన్నింగ్స్ రావడం తనకు ఆశ్చర్యం కలిగించలేదని పాటిల్ అన్నారు. ఆధునిక క్రికెట్‌లో యువ బ్యాటర్లకు తొలి బంతి నుంచే సహజమైన దూకుడుతో ఆడే స్వేచ్ఛ లభిస్తోందని, అభిషేక్, వైభవ్ ఆ అవకాశాన్ని సమర్థంగా ఉపయోగించుకుంటున్నారని ప్రశంసించారు. అయితే విదేశీ పర్యటనల్లోనూ అదే స్థాయిలో రాణించాలంటే స్వింగ్ అవుతున్న బంతులను ఎదుర్కొనే విషయంలో మరింత పట్టు సాధించాల్సిన అవసరం ఉందని సూచించారు.

# షూటింగ్‌లో మరో రజత పతకం

**టేబుల్ టెన్నిస్‌లో పాకిస్థాన్‌ను 3-0తో చిత్తు చేసిన భారత్**

- ఏషియన్ గేమ్స్‌లో భారత్ జోరు
- షూటింగ్‌లో మరో సిల్వర్
- పాక్‌పై టేబుల్ టెన్నిస్‌లో ఘన విజయం




**ఐచి-నాగోయా, సెప్టెంబర్ 21 :** జపాన్‌లోని ఐచి-నాగోయాలో జరుగుతున్న ఏషియన్ గేమ్స్ 2026లో భారత్‌కు రెండో రోజు కూడా పతకాల పంట కొనసాగుతోంది. సెప్టెంబర్ 21న షూటింగ్‌లో పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ ఈవెంట్‌లో భారత్ రజత పతకం సాధించింది. దీంతో భారత్ ఖాతాలో ఇప్పటివరకు మూడు రజత పతకాలు చేరాయి. షూటింగ్‌లో హిమాంశు ధిల్లాన్, పార్థ్ మానే, రుద్రాంశ్ పాటిల్తో కూడిన భారత జట్టు 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ ఈవెంట్‌లో రెండో స్థానంలో నిలిచింది. ఈ విజయంతో భారత్ మరో రజత పతకాన్ని ఖాతాలో వేసుకుంది. మహిళల టేబుల్ టెన్నిస్‌లో భారత్, పాకిస్థాన్ మధ్య జరిగిన గ్రూప్ ఎఫ్ మ్యాచ్‌లో భారత జట్టు 3-0తో విజయం సాధించింది. ఈ విజయంతో భారత మహిళల జట్టు క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించింది. భారత్ తరఫున సుతీర్థా ముఖర్జీ, సిండ్రెలా దాస్, శ్రీజా అకులా తమ తమ మ్యాచ్‌ల్లో విజయాలు సాధించారు. శ్రీజా అకులా తన సింగిల్స్ మ్యాచ్‌లో ఫాతిమా ఖాన్‌ను 11-4, 11-4, 11-5 తేడాతో ఓడించి భారత్‌కు 3-0 విజయాన్ని ఖరారు చేశారు.

### భారత్‌కు పతకాలపై భారీ ఆశలు

ఏషియన్ గేమ్స్ రెండో రోజు భారత్ పలు క్రీడాంశాల్లో బరిలోకి దిగింది. షూటింగ్‌తో పాటు టేబుల్ టెన్నిస్, మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ (వీహూ), హాకీ, కబడ్డీ, బ్యాడ్మింటన్, బాక్సింగ్ తదితర ఈవెంట్లలో భారత క్రీడాకారులు పోటీ పడుతున్నారు. వీహూలో సుచికా తారియాల్ సెమీఫైనల్‌లో సింగపూర్‌కు చెందిన టియో హుయ్ హూన్‌తో తలపడాల్సి ఉంది. సెమీఫైనల్‌కు చేరుకోవడంతో సుచికా ఇప్పటికే కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసుకున్నారు. ఫైనల్‌కు చేరితే స్వర్ణ పతకం కోసం పోటీపడే అవకాశం ఉంటుంది. మహిళల హాకీలో భారత్ ఇండోనేషియాతో, పురుషుల కబడ్డీలో జపాన్‌తో, మహిళల కబడ్డీలో బంగ్లాదేశ్‌తో తలపడుతోంది. బ్యాడ్మింటన్‌లో భారత పురుషుల జట్టు బంగ్లాదేశ్‌తో పోటీ పడుతోంది. బాక్సింగ్‌లో సుమిత్ 70 కేజీ విభాగంలో బుంజోంగ్ సింసిరితో పోటీపడుతున్నారు. ఏషియన్ గేమ్స్ 2026 తొలి రోజు భారత్‌కు షూటింగ్‌లో రెండు రజత పతకాలు లభించాయి. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత విభాగంలో ఎలావెనిల్ వలరివన్ రజతం సాధించగా, టీమ్ ఈవెంట్‌లో ఎలావెనిల్ వలరివన్, సోనమ్ మాస్కర్, విదర్భా వినోద్‌లతో కూడిన భారత జట్టు మరో రజత పతకం సాధించింది. ఇప్పుడు పురుషుల షూటింగ్ టీమ్ సాధించిన మరో రజతంతో భారత్ పతకాల సంఖ్య మూడు రజతాలకు చేరింది. ఏషియన్ గేమ్స్‌లో భారత్ మరిన్ని పతకాలు సాధించేందుకు రెండో రోజు పోటీలు కొనసాగుతున్నాయి.

# ఏషియన్ గేమ్స్‌లో సుచికా చరిత్ర

**హైదరాబాద్, సెప్టెంబరు 21 :** ఏషియన్ గేమ్స్‌లో మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ విభాగంలో భారత క్రీడాకారిణి సుచికా తారియాల్ చరిత్ర సృష్టించింది. మహిళల ట్రెడిషనల్ 60 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించింది. ఏషియన్ గేమ్స్‌లో ఎంఎంఏకు తొలిసారి చోటు దక్కగా.. ఈ విభాగంలో భారత్‌కు తొలి పతకాన్ని అందించిన క్రీడాకారిణిగా సుచికా రికార్డు నెలకొల్పింది. సెమీఫైనల్లో సింగపూర్‌కు చెందిన హుయ్ హూన్ టియోతో సుచికా తలపడింది. హోరాహోరీగా సాగిన ఈ పోరు అదనపు సమయానికి వెళ్లింది. చివరికి స్వల్ప తేడాతో సుచికా ఓటమి పాలై ఫైనల్ అవకాశాన్ని కోల్పోయింది. అయితే అప్పటికే కాంస్య పతకం ఖరారైంది. అంతకుముందు క్వార్టర్‌ఫైనల్లో మంగోలియాకు చెందిన అల్టాన్‌చిమెగ్ బైగల్మాను 2-0తో ఓడించి భారత్‌కు ఎంఎంఏలో తొలి పతకాన్ని ఖాయం చేసింది. 36 ఏళ్ల సుచికా క్రీడా ప్రయాణం ఎంఎంఏకే పరిమితం కాలేదు. జాతీయస్థాయిలో జూడో క్రీడాకారిణిగా ఎదిగిన ఆమె 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్‌లో పాల్గొంది. 2023 ఏషియన్ గేమ్స్‌లో కురాష్‌లోనూ పోటీపడింది. అనంతరం జియూ-జిట్సులో రాణించి 2024లో ఫైటింగ్ జియూ-జిట్సు ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచింది. 2017లో ఎంఎంఏలో ప్రొఫెషనల్‌గా అరంగేట్రం చేసిన ఆమె.. ఇతర క్రీడలపై దృష్టి పెట్టడంతో కొంతకాలం ఎంఎంఏకు దూరంగా ఉంది. 2024లో మళ్లీ ఎంఎంఏలోకి అడుగుపెట్టి 'బ్రేవ్ కంబాట్ ఫెడరేషన్'తో ఒప్పందం చేసుకుంది. గాయాలు సహా పలు సవాళ్లను అధిగమించి తిరిగి పోటీల్లోకి వచ్చిన సుచికా.. ఇప్పుడు ఏషియన్ గేమ్స్‌లో భారత్‌కు చారిత్రక పతకాన్ని అందించింది. ఏషియన్ గేమ్స్‌లో ఎంఎంఏ తొలిసారి ప్రవేశించగానే భారత్‌కు పతకం రావడం విశేషంగా నిలిచింది.



# ఫాల్కన్స్ 'ఫస్ట్' ఫైట్.. సీపీఎల్ కిరీటం సొంతం!



- జమైకా కింగ్స్‌మెన్‌కు ఫైనల్లో షాక్
- 8 వికెట్ల తేడాతో ఫాల్కన్స్ ఘన విజయం
- సదాఖత్ 114 పరుగుల విధ్వంసం వృథా
- 4 వికెట్లతో మ్యాచ్‌ను తిప్పిన మొకీమ్
- మూడో సీజన్‌లోనే తొలి టైటిల్ ముద్దాడిన ఆంటిగ్వా

**బ్రిడ్జ్‌టౌన్, సెప్టెంబర్ 21 :** కరీబియన్ ప్రీమియర్ లీగ్‌లో ఆంటిగ్వా అండ్ బార్బుడా ఫాల్కన్స్ కొత్త చరిత్ర సృష్టించింది. కెన్సింగ్టన్ ఓవల్‌లో ఆదివారం రాత్రి జరిగిన 2026 ఫైనల్లో జమైకా కింగ్స్‌మెన్‌ను ఎనిమిది వికెట్ల తేడాతో చిత్తుచేసి తొలిసారి సీపీఎల్ కిరీటాన్ని ముద్దాడింది. 171 పరుగుల లక్ష్యాన్ని ఫాల్కన్స్ 16.4 ఓవర్లలోనే రెండు వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఫ్రాంచైజీగా మూడో సీజన్‌లోనే ఛాంపియన్‌గా నిలిచి సత్తా చాటింది.

### సదాఖత్ ఒంటరి పోరాటం


టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన జమైకా కింగ్స్‌మెన్ నిర్ణీత 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లకు 170 పరుగులు చేసింది. మాజ్ సదాఖత్ 58 బంతుల్లో ఎనిమిది ఫోర్లు, తొమ్మిది సిక్సర్లతో ఏకంగా 114 పరుగులు బాదాడు. సైమ్ అయూబ్ 29 పరుగులు చేయగా మిగతా బ్యాటర్లు పెద్దగా రాణించలేకపోయారు. కిర్క్ మెకెంజీ, రోవ్‌మన్ పావెల్ సహా పలువురు ఖాతా తెరవకుండానే వెనుదిరిగారు. 30 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయిన కింగ్స్‌మెన్‌ను సదాఖత్, అయూబ్ ఆదుకున్నారు. మూడో వికెట్‌కు 80 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి స్కోరును 110 పరుగులకు చేర్చారు. ఈ దశలో ఫాల్కన్స్ స్పిన్నర్ సుఫ్యాన్ మొకీమ్ మ్యాచ్‌ను మలుపుతిప్పాడు. అయూబ్, పావెల్‌ను ఒకే ఓవర్‌లో పెవిలియన్‌కు పంపడంతో కింగ్స్‌మెన్ ఒక్కసారిగా కుప్పకూలింది. మొకీమ్ నాలుగు వికెట్లకు కేవలం 14 పరుగులిచ్చి ఫాల్కన్స్‌కు భారీ ఆధిక్యం అందించాడు.

### 171 లక్ష్యం.. 100 బంతుల్లోనే ఫినిష్

లక్ష్య ఛేదనలో రహ్‌కీమ్ కార్న్‌వాల్ తొలి ఓవర్‌లోనే రెండు ఫోర్లు, రెండు సిక్సర్లతో 20 పరుగులు రాబట్టి మెరుపు ఆరంభం ఇచ్చాడు. అయితే అదే ఓవర్ చివరి బంతికి ఔటయ్యాడు. అనంతరం ఎవిన్ లూయిస్, అమీర్ జంగూ రెండో వికెట్‌కు 64 పరుగులు జోడించారు. లూయిస్ 38 పరుగుల వద్ద వెనుదిరిగినా ఫాల్కన్స్ జోరుకు అడ్డుకట్ట పడలేదు. అమీర్ జంగూ, హసన్ నవాజ్ ఆ తర్వాత కింగ్స్‌మెన్ బౌలర్లకు మరో అవకాశం ఇవ్వలేదు. ఇద్దరూ మూడో వికెట్‌కు అజేయంగా 89 పరుగులు జోడించారు. జంగూ 57, హసన్ నవాజ్ 47 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. 16.4 ఓవర్లలో 173/2తో ఫాల్కన్స్ లక్ష్యాన్ని చేరుకుని మరో 20 బంతులు మిగిలుండగానే చారిత్రక విజయాన్ని అందుకుంది. నాలుగు వికెట్లతో ఫైనల్‌ను మలుపుతిప్పిన సుఫ్యాన్ మొకీమ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా, టోర్నీ మొత్తంలో రాణించిన షాదాబ్ ఖాన్ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా నిలిచారు. సదాఖత్ శతకం.. కింగ్స్‌మెన్ పోరాటం.. అన్నింటినీ అధిగమించిన ఫాల్కన్స్ చివరకు సీపీఎల్‌లో తమ తొలి కిరీటాన్ని ఎగరేసుకుపోయింది.

## రజనీకాంత్ X ఎస్‌జే సూర్య

అగ్రకథానాయకుడు రజనీకాంత్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'జైలర్ 2'. నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. విజయవంతమైన 'జైలర్'కి సీక్వెల్‌గా దీన్ని తీర్చిదిద్దుతున్నారు. రమ్యకృష్ణ, శివరాజ్‌కుమార్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. అక్టోబరు 15న థియేటర్లలోకి రానుందీ చిత్రం. ఈ నేపథ్యంలోనే ప్రచార కార్యక్రమాల్ని పరుగులు పెట్టిస్తోంది చిత్రబృందం. ఇందులో భాగంగానే ఇటీవలే నటుడు ఎస్‌జే సూర్య... ఈ చిత్రంలో బోధీ అనే పాత్రలో కనిపించనున్నట్లు తెలుపుతూ.. సామాజిక మాధ్యమాల వేదికగా ఓ ప్రోమోను విడుదల చేసింది. ఈ వీడియోలో కళ్లద్దాలు పెట్టుకొని స్టైలిష్ లుక్‌లో కనిపిస్తూ సినీప్రియుల్ని ఆకట్టుకుంటున్నారాయన. ఈ సినిమాలో రజనీకాంత్‌ను ఢీ కొట్టే పాత్రలో సూర్య కనిపించనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు కాంత అనే పాత్రలో విద్యాబాలన్ కనిపించనున్నట్లు వెల్లడించాయి చిత్రవర్గాలు.



రాధికా ఆప్టే, సిద్ధార్థ్, అదితి రావు హైదరీ, విజయ్ వర్మ, కొంకణా సేన్ శర్మ, అభిషేక్ బెనర్జీ, అలీ ఫజల్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన నెట్‌ఫ్లిక్స్ ఆంథాలజీ సిరీస్ 'లస్ట్‌స్టోరీస్ 3'. ఇందులో మహిళల కోణంలో కోరిక, సంబంధాలు, సాన్నిహిత్యాన్ని చూపించారు. విక్రమాధిత్య మొత్వానే, కిరణ్ రావు, శకున్ బాత్రా, విశాల్ భరద్వాజ్ లాంటి స్టార్ డైరెక్టర్లు తెరకెక్కించిన ఈ సిరీస్ సెప్టెంబర్ 18 నుంచి స్ట్రీమింగ్ అవుతూ ఆడియెన్స్‌ను విశేషంగా అలరిస్తోంది. ముఖ్యంగా నిజ జీవితంలో భార్యాభర్తలైన సిద్ధార్థ్, అదితి ఈ సిరీస్‌లో స్క్రీన్ షేర్ చేసుకోవడం హాట్ టాపిక్‌గా మారింది. ఈ నేపథ్యంలో తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సిద్ధార్థ్.. ఇంటిమేట్ సీన్స్‌లో నటించేటప్పుడు తెర వెనుక జరిగే విషయాలపై ఓపెన్‌గా మాట్లాడారు. సినిమాల్లో రొమాంటిక్ సన్నివేశాలను చిత్రీకరించేటప్పుడు సెట్స్‌లో వాతావరణం చాలా ప్రొఫెషనల్‌గా, సేఫ్‌గా ఉంటుందని సిద్ధార్థ్ స్పష్టం చేశారు. ఇంటిమసీ కోఆర్డినేటర్ల పర్యవేక్షణలోనే ఇలాంటి సీన్స్ షూట్ చేస్తారని చెప్పారు. ఆ సమయంలో సెట్‌లో కేవలం అత్యవసరమైన 20 మంది సిబ్బంది మాత్రమే ఉంటారని, మిగతా ఎవరినీ అనుమతించరని తెలిపారు.

నటీనటుల భద్రతకు, వాళ్ల కంఫర్ట్‌కు ఎంతో ప్రాధాన్యత ఇస్తారని, సెట్‌లో ఎవరైనా తాకాల్సి వస్తే ముందుగా యాక్టర్స్ పర్మిషన్ తీసుకోవడం రూల్ అని చెప్పారు. అంతేకాకుండా, నటీనటులకు ముందే తెలిసిన ఒక మహిళా క్రూ మెంబర్ కూడా అక్కడ కచ్చితంగా ఉండేలా చూస్తారన్నారు. షూటింగ్ సమయంలో ఇద్దరి మధ్య దూరం పాటించేందుకు పరుపులు లేదా దిండ్లు వాడటం వంటి రూల్స్ పాటిస్తామని సిద్ధార్థ్ వెల్లడించారు. రియల్ లైఫ్‌లో కపుల్ అయినప్పటికీ, కెమెరా ముందు మాత్రం ప్రొఫెషనల్ నిబంధనలు పక్కాగా ఫాలో కావాల్సిందేనని ఆయన తేల్చిచెప్పారు. సెట్‌లో ఇబ్బందిగా భావించే నటీనటులకు అండగా ఉండటమే ఇంటిమసీ కోఆర్డినేటర్ మెయిన్ డ్యూటీ అని చెప్పారు. ఏ పనైనా నటీనటులకు పూర్తి అవగాహన ఇచ్చే చేపిస్తారని, ఎవరినీ బలవంతం చేయరని తెలిపారు. కెమెరా ముందు యాక్టర్స్ ఫ్రీగా నటించాలంటే మాత్రం డైరెక్టర్, కెమెరామెన్, యాక్టర్ మధ్య మంచి నమ్మకం ఉండటం చాలా ముఖ్యం అని సిద్ధార్థ్ చెప్పుకొచ్చారు.



## రియల్ లైఫ్‌లో భార్యభర్తలైనా ఖచ్చితంగా ఆ నియమాలు పాటించాల్సిందే


## ముగ్గురు భామలతో వెంకటేష్ మాస్ స్టెప్స్..



విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వస్తున్న ఫుల్ లెంత్ ఫన్ అండ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం: 47 - ఏకే 47'. ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తుండగా, హారిక & హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతోంది. అక్టోబర్ 2, 2026న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమాకు సంబంధించి మేకర్స్ తాజాగా, మ్యూజికల్ జర్నీని ప్రారంభించినట్లు ప్రకటించారు. ప్రమోషన్స్‌లో దూసుకుపోయేందుకు చిత్రబృందం సిద్ధమైంది. సినిమాలోని మొదటి పాట 'నారాయణమ్మ' అని సాగే సాంగ్ అప్‌డేట్ సోషల్ మీడియాలో సెన్సేషన్ సృష్టిస్తోంది.

ఈ సెన్సేషనల్ సాంగ్ అద్భుతమైన వైబ్‌తో సెప్టెంబర్ 22న విడుదల కానుందని చిత్రబృందం వెల్లడించింది. సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్.ఎస్. థమన్ ఈ చిత్రానికి అదిరిపోయే మ్యూజిక్ అందిస్తున్నారు. ఈ ఫస్ట్ సింగిల్‌తో ఒక నయా బ్యాంగర్ ట్యూన్ లోడింగ్ అవుతోందని, ఆల్బమ్‌లోనే ఇది బిగ్గెస్ట్ చార్ట్‌బస్టర్‌గా నిలుస్తుందని మేకర్స్ ఫుల్ కాన్ఫిడెంట్‌గా ఉన్నారు. అయితే ఈ పాటలో వెంకటేష్‌తో పాటు శ్రీనిధి శెట్టి, నివేతా పేతురాజ్, డింపుల్ హయాతి కలిసి స్టెప్స్ వేయడం విశేషం. నారా రోహిత్, పూజిత పొన్నాడ, రావు రమేష్, సత్య తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంలోని ఫస్ట్ సింగిల్ కోసం వెంకీ మామ ఫ్యాన్స్ అంతా ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

## హిట్ కాంబో రిపీట్.. తొమ్మిదేళ్ల తర్వాత టాలీవుడ్‌కు రీఎంట్రీ ఇస్తున్న శ్వేతా బసు ప్రసాద్!





టాలీవుడ్‌లో ఒకప్పుడు ట్రెండ్ సెట్ చేసిన క్యూట్ కపుల్ వరుణ్ సందేశ్, శ్వేతా బసు ప్రసాద్ జోడీ చాలా కాలం తర్వాత మరోసారి తెరపై మ్యాజిక్ చేయడానికి సిద్ధమవుతోంది. శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో, ప్రముఖ నిర్మాత దిల్‌రాజు తెరకెక్కించిన 'కొత్త బంగారు లోకం' చిత్రంలో బాలు, స్వప్న పాత్రలుగా వీరు చేసిన అల్లరి, చూపిన కెమిస్ట్రీ ప్రేక్షకులకు ఎప్పటికీ గుర్తిండిపోతుందనడంలో అతిశయోక్తి లేదు.. అప్పట్లో ఈ సినిమా యూత్‌ను ఎంతగానో ఆకట్టుకుంది. ఇప్పుడు ఈ సక్సెస్‌ఫుల్ జోడీ మళ్లీ రిపీట్ కానుందనే పోస్టులు ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. వీరి ఆన్‌స్క్రీన్ జోడీని ఇష్టపడే ఫ్యాన్స్ ఈ క్రేజీ ప్రాజెక్ట్ కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఈ సినిమాతో శ్వేతా బసు ప్రసాద్ టాలీవుడ్‌కు రీఎంట్రీ ఇస్తుండటం ఈ ప్రాజెక్ట్‌కే హైలైట్‌గా నిలిచింది.


ఆమె చివరిసారిగా తెలుగులో 2017లో 'మిక్చర్ పొట్లం' మూవీలో నటించింది. ఆ తర్వాత బాలీవుడ్‌కు వెళ్లిన ఈ భామ అక్కడ కొన్ని చిత్రాలు, వెబ్ సిరీస్‌లతో అలరించింది. ఆ తర్వాత 2022లో 'ఇండిమా లాక్‌డౌన్' అనే చిత్రంలో నటించిన ఆమె, ఆ తర్వాత కొంతకాలం సినిమాలకు దూరంగా ఉన్నారు. సరిగ్గా నాలుగేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఆమె మళ్లీ టాలీవుడ్ ప్రేక్షకులను పలకరించనున్నారు. వరుణ్ సందేశ్‌తో కలిసి శ్వేతా బసు ప్రసాద్ చేస్తున్న ఈ రీఎంట్రీ మూవీపై అప్పుడే భారీ అంచనాలు క్రియేట్ అయ్యాయి. పాత జ్ఞాపకాలను నెమరువేసుకునేలా వీరిద్దరి కాంబినేషన్ ఉండబోతుందని సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది.

బాలీవుడ్ సీనియర్ నటి అమీషా పటేల్ సోషల్ మీడియాలో అభిమానులతో ముచ్చటించి కొన్ని సంచలన వ్యాఖ్యలు చేశారు. సినిమాల ప్రమోషన్స్ సమయంలో కొందరు హీరోయిన్లు భారీగా సిబ్బందిని వెంటేసుకుని తిరగడంపై ఆమె స్పందించిన తీరు చర్చనీయాంశంగా మారింది. 'షూటింగ్‌ల సమయంలో నిర్మాతల ఖర్చుతో చాలా మంది హీరోయిన్లు తమతో పాటు పెద్ద సంఖ్యలో సిబ్బందిని తీసుకువెళ్లడం గురించి మీరేమనుకుంటారు? అని ఓ అభిమాని అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. చాలా మంది నటీమణులు తమ స్టార్‌డమ్‌ను తప్పుగా అర్థం చేసుకుంటూ భ్రమలో బతుకుతున్నారని విమర్శించారు. సినిమా ప్రమోషన్స్ కోసం నిర్మాతల ఖర్చుతో వారు తీసుకెళ్లే సిబ్బంది ఖర్చు.. ఆ సినిమా మొదటి రోజు కలెక్షన్ల కంటే చాలా ఎక్కువగా ఉంటోందని మండిపడ్డారు. అదే నిర్మాత డబ్బులు ఇవ్వకపోతే సొంత ఖర్చులతో వాళ్ళు అలాగే తిరుగుతారా? అని ప్రశ్నించారు. అయితే ఆమె ఎవరి పేర్లనూ నేరుగా చెప్పనప్పటికీ ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. ఇక కొత్త సినిమాల గురించి మరో అభిమాని అడగగా.. అమీషా పటేల్ చాలా స్పష్టంగా బదులిచ్చారు. 'బై వన్ గెట్ వన్ ఫ్రీ' ఆఫర్లు, రూ. 99 టికెట్ రేట్లు ఉన్న సినిమాల్లో నటించే ఆసక్తి తనకు లేదని తేల్చిచెప్పారు. అలాంటి పనికిరాని చిన్న సినిమాలు చేయడానికి బదులుగా.. కొన్ని సంవత్సరాలకొకసారి 'గదర్' లాంటి పెద్ద విజయాన్ని ఇవ్వడమే తనకిష్టమని చెప్పారు. త్వరలోనే బాక్సాఫీస్ వద్ద మరోసారి పెద్ద సంచలనం సృష్టిస్తానని అన్నారు.

## చాలామంది హీరోయిన్లు స్టార్‌డమ్ భ్రమలో బతుకుతున్నారు..



## నాని 'ది ప్యారడైజ్'కు సెన్సార్ షాక్.. ఏకంగా అన్ని కట్స్‌తో తగ్గిన రన్‌టైమ్?




'దసరా' వంటి సంచలన విజయం తర్వాత నేచురల్ స్టార్ నాని, టాలెంటెడ్ డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల కలయికలో వస్తున్న మూవీ 'ది ప్యారడైజ్'. ఈ హై-వోల్టేజ్ మాస్ ఎంటర్‌టైనర్ కోసం నాని అభిమానులు ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు. ఈ సినిమాను సెప్టెంబర్ 24న థియేటర్స్‌లోకి తీసుకురాబోతున్నారు. ఈనేపథ్యంలో.. తాజాగా, ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుని (A) సర్టిఫికెట్‌ను సొంతం చేసుకుంది. సినిమాలోని ఇంటెన్స్ కంటెంట్ కారణంగా సెన్సార్ బోర్డ్ కొన్ని మార్పులు సూచించగా.. మేకర్స్ ఏకంగా 21 కట్స్‌తో ఈ చిత్రాన్ని సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. సినిమాలో ఉన్న వయొలెన్స్, హింసాత్మక రక్తపు దృశ్యాలతో పాటు కొన్ని బోల్డ్ అండ్ అసభ్యకరమైన డైలాగ్స్‌ను మేకర్స్ మ్యూట్ చేయడం జరిగిందట. అలాగే సిగరెట్ బ్రాండ్లు, ధూమపాన సన్నివేశాలతో పాటు పలు రాజకీయ ప్రస్తావనలు, పొలిటికల్ రిఫరెన్స్‌లను కూడా సెన్సార్ నిబంధనల మేరకు సవరించినట్లు టాక్. మొత్తంగా ఈ మార్పుల కారణంగా సుమారు 25 సెకన్ల విజువల్స్‌ను పూర్తిగా తొలగించగా, మరో 1 నిమిషం 25 సెకన్ల సీన్లను మోడిఫై చేశారట. ఈ సెన్సార్ ట్రిమ్మింగ్స్ అన్నీ పోను.. సినిమా ఫైనల్ రన్‌టైమ్‌ను 2 గంటల 54 నిమిషాల 4 సెకట్లుగా లాక్ చేశారు. ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై నిర్మాత సుధాకర్ చెరుకూరి అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రంలో నాని సరసన కాయదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తోంది. అన్ని రకాల సెన్సార్ అడ్డంకులను విజయవంతంగా దాటుకున్న ఈ మాస్ యాక్షన్ థ్రిల్లర్ బాక్సాఫీస్‌ను షేక్ చేయడానికి సిద్ధమైంది.

కోలీవుడ్ టాలెంటెడ్ యంగ్ బ్యూటీ దుషారా విజయన్ వరుస క్రేజీ ప్రాజెక్ట్‌లతో ఫుల్ జోరుమీదున్నారు. ఇటీవల 'జేడి నాయుడు' సినిమాతో ప్రేక్షకులను అలరించిన ఈ భామ.. తాజాగా మరో ఆసక్తికరమైన చిత్రంతో వస్తున్నారు. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'ఆల్మోస్ట్ నల్లవన్'. ఈ చిత్రానికి ప్రముఖ నటుడు రాజు జయమోహన్ దర్శకత్వం వహిస్తుండటంతో పాటు ఇందులో ప్రధాన పాత్రలోనూ నటిస్తున్నారు. మరో విశేషం ఏమిటంటే.. టాలెంటెడ్ డైరెక్టర్ హెచ్. వినోద్ ఈ సినిమాకు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. 'ఆస్పైర్ ఉబుంటు ఫిల్మ్స్' బ్యానర్‌పై ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నారు. ఈ సినిమాలో సీనియర్ నటుడు సత్యరాజ్, ఇమ్మాన్ అన్నాచ్చి, తామరై సెల్వి తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన మొదటి షెడ్యూల్ విజయవంతంగా పూర్తి కాగా.. తాజాగా, దుషారా రెండో షెడ్యూల్ అప్డేట్ ఇచ్చారు. ప్రస్తుతం రెండో షెడ్యూల్ షూటింగ్ తెన్కాశి పరిసర ప్రాంతాల్లో శరవేగంగా జరుగుతోందని వెల్లడించారు. అంతేకాకుండా షూటింగ్ స్పాట్‌కు సంబంధించిన కొన్ని ప్రత్యేక ఫొటోలను కూడా ఆమె షేర్ చేయడంతో నెట్టింట వైరల్ అవుతున్నాయి. డిఫరెంట్ కాన్సెప్ట్‌తో రానున్న ఈ సినిమాపై ఇండస్ట్రీలో అప్పుడే మంచి అంచనాలు నెలకొన్నాయి.

## 'ఆల్మోస్ట్ నల్లవన్' షూటింగ్ అప్డేట్ ఇచ్చిన దుషారా విజయన్



Printed, Published and Owned by V SAMPATH, and Printed at Sharada Printers, H.No 1-6-6, Shastri Road, Karimnagar, Dist: Karimnagar -505001,Telangana State, and Published from 8-5-137, Gayathri Nagar, Karimnagar (Karimnagar District) 505001,Telangana State. Editor: V SAMPATH. RNI NO : TELTEL/2023/89146 Email: shenarthimedia@gmail.com. Phone No: 9391343644